ప్రజాశక్తి

మంగళవారం 9 మే 2023 | 8 పేజీలు

ప్రకాశం | బాపట్ల





15న నిజాంపట్నంకు సిఎం జగన్

- మత్స్యకార భరోసా నగదు పంపిణీ ప్రారంభించనున్న ముఖ్యమంత్రి..
- కలెక్టర్ రంజిత్‌బాషా వెల్లడి



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

వైఎస్‌ఆర్ మత్స్యకార భరోసా నగదు పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 15న బాపట్ల జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ప్రకటించారు. అధికారికంగా సి.ఎంఒ నుంచి సమాచారం అందిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నిజాంపట్నంలో ఖరారయినట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లా అధికారులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. వై.యస్.ఆర్ మత్స్యకార భరోసా కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరవుతున్నందున జయప్రదం చేయాలని సూచించారు. నిజాంపట్నం మండలంలో సి.ఎం సభాస్థలి ప్రాంగణాన్ని, హెలిప్యాడ్ ప్రాంతాలను గుర్తించాలని రేపల్లె ఆర్‌డిఒను ఆదేశించారు. కార్యక్రమానికి మత్స్యకారులను తరలించే బాధ్యత సంబంధిత మత్స్యశాఖ సంయుక్త సంచాలకులదేనన్నారు. 250 ఆర్.టి.సి బస్సులు, మరో 250 ప్రైవేటు వాహనాలను సిద్ధం చేయాలని ఆర్‌టిఒను ఆదేశించారు. ఈ నెల 14నే అధికారుల ఆధీనంలో వాహనాలు ఉండాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, కళాకారుల బందాల ఏర్పాటు బాధ్యత విద్యాశాఖాధికారి నిర్వహించాలన్నారు. సభావేదిక ఏర్పాట్ల బాధ్యత ప్రకాశం, గుంటూరు జెడ్.పి సి.ఇ.ఓలు, చీరాల ఆర్‌డిఓదే అన్నారు. సభా ప్రాంగణం, సమీప ప్రాంతాల పారిశుధ్య కార్యక్రమాలను జిల్లా పంచాయితీ అధికారి, బాపట్ల ఆర్.డి.ఓ సంయుక్తంగా నిర్వహించాలన్నారు. సభాప్రాంగణానికి చేరుకోవడానికి వాహనాల రూట్ మ్యాప్, పార్కింగ్ స్థలాల ఏర్పాటు ప్రక్రియను బాపట్ల ఆర్.డి.ఓ చేపట్టాలన్నారు. స్టాల్స్, గ్యాలరీల ఏర్పాటుపై అధికారులు సమగ్ర ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆయన ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను జయప్రదం చేయడానికి జిల్లా అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమానికి ఎలాంటి అవాంతరాలు ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన మార్గనిర్దేశం చేశారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టరు సి.హెచ్.శ్రీధర్, డి.ఆర్.ఓ కె.లక్ష్మీశివజ్యోతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'వెలిగొండ' పనుల్లో అనిశ్చితి

- సొరంగాల్లోకి వరద నీరు చేరడంతో నిలిచిన పనులు
- గడువు సమీపిస్తున్నందున పూర్తికావడంపైనే సందిగ్ధం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

అక్టోబరులో వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభిస్తామని సిఎం జగన్ ప్రకటించారు. ఆయన ప్రకటించిన గడువు సమీపిస్తోంది. కేవలం ఐదు నెలలే సమయం ఉంది. పనుల్లో అనిశ్చితి నెలకొంది. ప్రస్తుతం శ్రీశైలం అడవుల్లో భారీ వర్షాలు కురియడంతో సొరంగాల్లోకి వరదనీరు చేరింది. రెండు సొరంగాలూ ఇప్పుడు వరదనీటితోనే ఉన్నాయి. దీంతో రెండో సొరంగం పనులు నాలుగు రోజులుగా ఆగిపోయాయి. నీటిని పూర్తిగా తోడేసి పనులు చేపట్టాల్సి ఉంది.

ప్రస్తుతం సొరంగాల వద్ద మోటార్లు పెట్టి నీటిని తోడుతున్నారు. 18 కిలోమీటర్ల పొడవుండే సొరంగాల్లో నీరు చేరింది. దీన్ని మోటార్లతో బయటకు తోడటం అంత సులువైన పనేమీ కాదు. మంత్రి ఆదిమూలపు సురేష్ కూడా సొరంగాల వద్దకు వెళ్లి వరద నీటిని తోడే పనులు పరిశీలించారు. నీటిని పూర్తిగా తోడాలంటే కనీసం వారం రోజులు



వెలిగొండ టన్నెల్ వద్ద నిల్వ ఉన్న వరదనీరు

పడుతుందని సమాచారం. మరోవైపు ప్రాజెక్టు పనులు అక్టోబరు నాటికి పూర్తిచేయాల్సి ఉంది. రెండో సొరంగం పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. మాన్యువల్‌గా తవ్వకాలు చేపట్టారు. యంత్రాలతో సాధ్యం కాలేదు. 18.838 కిలోమీటర్లకుగానూ ఇప్పటి వరకూ 17.014 కిలోమీటర్లు తవ్వకం జరిగింది. ఇంకా కిలోమీటరు వరకూ తవ్వకం జరగాల్సి ఉంది. దీన్ని పూర్తిచేయడం పెద్ద సవాలుగానే మారింది. ఈ సొరంగం పనులు పూర్తి చేస్తేనే ప్రాజెక్టును ప్రారంభించడానికి అవకాశం ఉంది. ఇక ఈ పనులు తిరిగి ప్రారంభం కావాల్సి ఉంది. మళ్లీ వర్షాలు కురిస్తే పనులకు ఆటంకం కలిగినట్లే. ఏదేమైనా సమయం తక్కువగా ఉన్నందున సందిగ్ధం నెలకొంది. మరోవైపు పునరావాసం కూడా కాలేదు. ముంపు గ్రామాల్లో జనం అక్కడే ఉన్నారు. వారికి ప్యాకేజీలు ఇవ్వలేదు. ఈ ఏడాది బడ్జెట్‌లో నిధులు కేవలం రూ.100 కోట్లే కేటాయించారు. వన్‌టైమ్ సెటిల్‌మెంటు కింద ప్యాకేజీ రూ.12.50 లక్షలు ప్రకటించారు. వీటికి నిధులు కేటాయించాల్సి ఉంది. పునరావాస కాలనీలు ఇంకా ఓ కొలిక్కి రాలేదు. పరిహారం ప్రక్రియ ఇదే పరిస్థితి. ఏళ్ల తరబడి పరిహారాలు, ప్యాకేజీల కోసమే నిర్వాసితులు తిరుగుతున్నారు. జాబితాల్లో గందరగోళం కొనసాగుతోంది. గతంలో జాబితాలను ప్రకటించారు. వెంటనే ప్యాకేజీలు ఇస్తే సమస్య రాదు. పెండింగులో పెట్టారు. మళ్లీ ఇప్పుడు ప్యాకేజీలు అనగానే పిల్లలు పెద్దయ్యారు. వాళ్లంతా మళ్లీ అర్హత సాధించారు. వారిని జాబితాల్లో చేర్చాల్సి ఉంది. మళ్లీ సర్వేలు, పరిశీలనలు పేరుతో కాలయాపనలు జరుగుతున్నాయి. ఇప్పటికీ అర్హులందరికీ స్థానం లేదు. రెండు వేల మందికిపైగా ▶ 2లో

మామిడి మార్కెట్ తారుమారు

- బంగినపల్లి ధరలు కింది చూపు
- చెరుకు రసం చూపు పైపైకి..
- సువర్ణ రేఖ, బెంగుళూరు రకాలకు లాభసాటి ధరలు



ప్రజాశక్తి-శింగరాయకొండ

మామిడి మార్కెట్ చిత్రవిచిత్రమైన మలుపులు తిరుగుతోంది. ఏటేటా మంచి ధరలు పలికే బంగినపల్లి కాయల ధరలు రోజు రోజుకూ తగ్గిపోతున్నాయి. సాధారణంగా బంగినపల్లితో పోలిస్తే తక్కువ ధరలు పలికే రకాల ఇతర మామిళ్ల ధరలు పెరుగు తున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే మామిడి మార్కెట్ తారుమారైంది.

జిల్లాలోని శింగ రాయకొండ నెల్లూరు జిల్లా, ఉలవపాడుకు పక్కనే ఉంటుంది. ఉలవపాడు కేంద్రంగానే ముంబై, హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు, పూనే, ఢిల్లీ వంటి నగరాలకు మామిడికాయలు ఎగుమతులు జరుగుతుంటాయి. పైపెచ్చు ఉలవపాడు జాతీయ రహదారి మీద ఉండటం తో ఎగుమతిదారులకు ఆ ఊరు కేంద్రంగా మారింది. ఇప్పటికే ఉలవపాడు, శింగరాయ కొండ జాతీయ రహదారి మీద మామిడి అమ్ముకునేందుకు షాపులు వెలిసి ఉన్నాయి. దూర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు జాతీయ రహదారి మీద పెట్టిన షాపుల వద్ద కొనుగోలు చేసుకొని వెళ్తున్నారు. శింగరాయకొండ మండలంలో శానంపూడి, కనుమల్ల, సోమరాజుపల్లి, పాకల, పాత శింగరాయకొండ గ్రామాల్లో మామిడి అధికంగా సాగులో ఉంది. మండలంలో 1100 ఎకరాలు ఉన్నాయి. జరుగుమల్లి, టంగుటూరు, పొన్నలూరు, కొండపి, మర్రిపూడి మండలాల్లో కూడా అక్కడక్కడా మామిడి తోటలు ఉన్నాయి. ఇప్పుడిప్పుడే మామిడికాయల కోతలు ప్రారంభమయ్యాయి. తొలి దశలో మధుర ఫలమని పేరు తెచ్చుకున్న బంగినపల్లి మామిళ్ళ ధర టన్నుకు రూ.45 నుంచి 60 వేల రూపాయల వరకు పలికింది. అప్పటి కొనుగోలుదారులంతా స్థానిక వ్యాపారులే. ఇప్పుడిప్పుడే ఎగుమతి వ్యాపారులు రంగ ప్రవేశం చేస్తున్నారు. వారు వచ్చీ రావడంతోనే బంగినపల్లి ధరలు తగ్గించారు. ఇప్పుడు బంగినపల్లి మామిళ్ళను టన్ను 30 నుంచి 40 వేల రూపాయలకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. స్థానికంగా 'పండు ఈగ' అని పిలిచే పురుగు సమస్య వల్ల బంగినపల్లి మామిళ్లలో నాణ్యత తగ్గింది. మామిడికాయ పండుగా మారే సమయానికి దానిలో ఈగ చేరడమే పండు ఈగ సమస్య. కొన్ని తోటలోనే పండు ఈగ సమస్య కనిపిస్తున్నప్పటికీ వ్యాపారులు సహజంగానే అన్ని తోటల్లోని బంగినపల్లి మామిళ్లను అనుమానం దష్టితో చూస్తున్నారు. మరో వంక దాదాపు నెలరోజులుగా దక్షిణాది రాష్ట్రాలను ముంచెత్తుతున్న వడగళ్ళ వానలు, గాలి వానలతో పెద్ద ఎత్తున మామిళ్లు నేల రాలుతున్నాయి. నేలరాలిన మామిళ్ళు చెన్నై, విజయవాడ, హైదరాబాద్ వంటి నగరాలలోని మామిళ్ళ మార్కెట్లను ముంచేత్తుతున్నాయి. నేల రాలిన కాయలు సహజంగానే తక్కువ ధరలు పలుకుతాయి. తరచుగా గాలివానలకు రాలిన కాయలు మార్కెట్లకు రావడం వల్ల కోత కోసిన కాయల ▶ 2లో



మామిడి కాయలను గ్రేడ్ చేస్తున్న దృశ్యం

బాలికపై వృద్ధుడి అఘాయిత్యం

పోక్సో చట్టం కింద కేసు నమోదు

▲ 3లో

ఉపాధ్యాయుడి ఆత్మహత్య కలకలం

- చెరువులో వెతికినా కనిపించని ఆచూకీ
- పట్టణంలో తిరుగుతుండటంతో ఇంటికి తీసుకొచ్చిన కుటుంబసభ్యులు

▲ 3లో

అక్రమార్కులకు 'రెవెన్యూ'అండ

- న్యాయం కోసం ఏడాదిగా బాధితుల ప్రదక్షిణలు

ప్రజాశక్తి-మార్కాపురం

రెవెన్యూ శాఖలో జరుగుతున్న అక్రమాలకు అర్హులు బాధితులుగా మిగిలిపోతున్నారు. అక్రమార్కులకు అండగా అధికారులు నిలవడంతో అర్హులు న్యాయం కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది.

మార్కాపురం డివిజన్ పరిధిలోని అర్ధవీడు మండలం నాగులవరం గ్రామ నడిబొడ్డున సర్వే నెంబర్ 1428లో 17 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమి నివాసాలకు యోగ్యమైనది. ప్రస్తుతం ఆ భూమి విలువ కూడా పెరిగింది. ఆ భూమిలో గతంలో గూడ చెన్నారెడ్డి అనుభంలో ఉన్నాడు. చెన్నారెడ్డి అనే వ్యక్తి ఆ భూమిని అదే గ్రామానికి చెందిన బొగ్గు కొండారెడ్డికి అమ్మాడు. మూడు దశాబ్దాలుగా కొనుగోలు చేసిన భూమిని కొండారెడ్డి అనుభవంలో ఉంచుకున్నాడు. ఆ స్థలానికి అప్పట్లోనే ప్రహరీ నిర్మించారు. కొండారెడ్డి తాను కొనుగోలు 17 సెంట్ల భూమిలో కుమారుడు బొగ్గు వెంకటరెడ్డికి 0.05 సెంట్లు, కుమార్తె దారేటి విజయలక్ష్మికి 0.12 సెంట్లు అగ్రిమెంటు ద్వారా పంపకాలు చేశాడు. ఆ స్థలం



కుటుంబ సభ్యులతో బాధితుడు బొగ్గు వెంకటరెడ్డి

నివాసాలకు ఉపయోగకరంగా ఉన్నందున మంచి ధర పలుకుతోంది. ఈ భూమిని పూర్వంలో అనుభవంలో ఉండి అమ్మిన చెన్నారెడ్డి మరణించాడు. చెన్నారెడ్డి అమ్మే క్రమంలో ఇద్దరు కుమారులు ఇంద్రసేనారెడ్డి, సుధాకర్‌రెడ్డి కొనుగోలు చేసిన కొండారెడ్డికి అగ్రిమెంట్‌లో సంతకాలు చేసినట్లు తెలిసింది. భూమికి ధర రావడంతో గతంలో అనుభవంలో ఉన్న గూడ చెన్నారెడ్డి వారసులు ప్రస్తుతం ఆ భూమి తమదంటూ అడ్డు తగులుతున్నారు. చెన్నారెడ్డి భార్య సుబ్బమ్మ ఈ భూమి నాదంటూ అమ్మకాలకు తెరలేపింది. 2018లో సర్వే నెంబర్ 1428లోని 0.17 సెంట్ల భూమికి ఆన్‌లైన్‌లో హక్కులు పొందారు. ఇదే భూమిని కొనుగోలు చేసిన కొండారెడ్డి వారసులను అడుగు పెట్టనీయడం లేదు. ఇటీవల కాలంలో దాడులు సైతం జరిగాయి. కొండారెడ్డి వారసులైన వెంకటరెడ్డి, విజయలక్ష్మి అనుభవంలో ఉన్నట్లు సర్వే రిపోర్టు కూడా ఉంది. ఎలాంటి ఆధారం లేని గూడ సుబ్బమ్మకు ఆన్‌లైన్‌లో ఎలా హక్కులు కల్పించారని బాధితుడు బొగ్గు వెంకటరెడ్డి, దారేటి విజయలక్ష్మి ప్రశ్నిస్తున్నారు. తాము కొనుగోలు చేసిన భూమిలో తమకు హక్కులు కల్పించాలని రెవెన్యూ అధికారులను కోరగా... అది ప్రభుత్వ భూమి అని... గ్రామం కంఠం అని సాకులు చెబుతున్నారని వెంకటరెడ్డి ఆరోపిస్తున్నారు. 2018లో గూడ సుబ్బమ్మకు ఆన్‌లైన్‌లో హక్కులు కల్పించే సమయంలో ప్రభుత్వ భూమి, గ్రామ కంఠం అనేవి అడ్డు రాలేదా అని ప్రశ్నిస్తున్నారు. ఈ భూమి తమకే చెందాలని ఏడాదిగా అధికారుల చుట్టూ ఆధారాలతో తిరుగుతున్నా న్యాయం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భూమి వ్యవహారంలో జరిగిన అక్రమాల చిట్టాతో మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్‌కు సోమవారం స్పందనలో అర్జీ అందజేశారు. రెవెన్యూ అధికారులు ఏ విధంగా స్పందిస్తారో చూడాలి మరి.

'వెలిగొండ' పనుల్లో అనిశ్చితి

(మొదటిపేజీ తరువాయి)

కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు. గతంలో జాబితాలో పేర్లు ఉండి ఇప్పుడు కొత్తగా ప్రకటించిన జాబితాల్లో పేర్లు గల్లంతయ్యాయని కొందరు అర్జీలు పెట్టారు. వీటిని అధికారులు పరిశీలన చేసి తుదిజాబితాలు సిద్ధం చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ మాత్రం వేగంగా జరగడం లేదు. అటు సొరంగం పనులు.. ఇటు పునరావాసం ఏకకాలంలో జరగాల్సి ఉంది. అందుకు కేవలం ఐదు నెలలే గడువు ఉంది. ప్రస్తుతం సొరంగాల పనుల్లోనూ అనిశ్చితి నెలకొంది. మరో వారం రోజుల్లో గానీ పనులు తిరిగి ప్రారంభం అయ్యే అవకాశం ఉంది.

మామిడి మార్కెట్ తారుమారు

(మొదటిపేజీ తరువాయి)

ధరలు కూడా తగ్గుతున్నాయి. విశేషం ఏమిటంటే చెరుకు రసం, సువర్ణ రేఖ, బెంగళూరు రకాల మామిళ్ళకు గిట్టుబాటు ధర లభిస్తున్నాయి. కొన్నిచోట్ల 'తోతాపురి' మరికొన్ని చోట్ల 'నోట్లు' అని పిలిచే బెంగళూరు మామిడికాయలను ఎక్కువగా చిత్తూరు, తిరుపతి జిల్లాలలోని జ్యూస్ ఫ్యాక్టరీలు కొనుగోలు చేస్తాయి. ఆ రెండు జిల్లాల్లో 50కి పైగా జ్యూస్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఇప్పుడు ఈ జ్యూస్ ఫ్యాక్టరీల దళారులు ఉలవపాడు కేంద్రంగా బెంగళూరు మామిళ్లను టన్ను 18 నుంచి 19 వేల రూపాయల వరకు కొనుగోలు చేస్తున్నారు. దండిగా దిగుబడి ఇచ్చే బెంగుళూరు రకం మామిళ్లకు ఇది లాభసాటి ధరే.. ఇక తియతియ్యని రసాలు ఊరే చెరుకు రసం మామిళ్ల ధర టన్ను రూ.40 వేల వరకు పలుకుతోంది. హైదరాబాద్ మార్కెట్లో ఆ మామిళ్లకు మంచి గిరాకీ ఉంది. అయితే ఈ సారి చెరుకు రసం మామిడి పంట దిగుబడి దిగనాసిగా ఉంది. సాధారణంగా చెరుకు రసం మామిడి చెట్లు ముందుగా పూతకు వస్తాయి. ఈ సారి 10 శాతం చెట్లలోనే ముందుగా పూతలు వచ్చాయి. మిగిలిన చెరుకు రసం చెట్లలో ఫిబ్రవరిలో పూతలొచ్చాయి. ఆలస్యంగా వచ్చిన పూతల్లోని పిందెలు ఇంకా కోతకు రాలేదు. నెల్లూరు జిల్లాతో పాటు రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లోనూ పరిస్థితి ఇలాగే ఉండటంతో చెరుకు రసం మామిళ్ళకు లాభసాటి ధరలు పలుకుతున్నాయి. సువర్ణరేఖ మావిళ్లు టన్నుకు 30 వేల రూపాయల ధర పలుకుతోంది. ఆకర్షణీయమైన రంగుతో మాధుర్యాన్ని ఒలికించే సువర్ణ రేఖ మామిడి పళ్లు ఎక్కువ కాలం నిల్వ ఉండవు. అందువల్ల ఏటేటా సువర్ణ రేఖ మామిళ్ళకు టన్నుకు 15 నుంచి 20 వేల రూపాయల ధర మాత్రమే పలుకుతుంది. ఈసారి సువర్ణ రేఖ పంట దిగుబడి కూడా అతి తక్కువగా ఉండంతో మార్కెట్లో గిరాకీ పెరిగింది. ప్రత్యేకించి విజయవాడ, హైదరాబాద్ మార్కెట్లో సువర్ణరేఖ మామిడికి గిరాకీ ఎక్కువగా ఉంది.

అంగన్‌వాడీ కార్యాలయం ప్రారంభం

ఇంకొల్లు రూరల్ : ఇంకొల్లు సెక్టార్ ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని వైసీపీ ఇంకొల్లు మండల కన్వీనర్ బండారు ప్రభాకర్‌రావు ప్రారంభించారు. నూతన జిల్లాల ఏర్పాటు అనంతరం ఇంకొల్లు, కారంచేడు, చినగంజాం మండలాలకు సంబంధించిన ప్రాజెక్టును ఇంకొల్లు కేంద్రంగా ఏర్పాటు చేశారు. ఇక నుంచి ఇంకొల్లు కేంద్రంగా అంగన్‌వాడీ సేవలు జరగనున్నాయని సిడిపిఓ టి ఝాన్సీ తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో మొత్తం 177 సెంటర్లు ఉన్నాయన్నారు. ప్రారంభ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

13లోపు పేర్లు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-పర్చూరు

ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తుందని పర్చూరు మండల వ్యవసాయాధికారి ఎస్ రామ్మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పర్చూరు మండలంలోని రైతులు గిట్టుబాటు ధరకు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద మద్దతు ధరకు విక్రయించుకోవాలని కోరారు. రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులు తమ పేర్లను ఈ నెల 13వ తేదీలోపు నమోదు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం రూ.1962 మద్దతు ధరకు రైతుల వద్ద నుంచి మొక్కజొన్న కొనుగోలు చేస్తుందని రామ్మోహన్‌రెడ్డి వివరించారు.



ఫిర్యాది దారులతో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందాల్

ఫిర్యాదులు పరిష్కరించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

నిర్దిష్ట గడువు లోపు స్పందన ద్వారా వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలని బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం బాపట్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల ప్రజలు జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చి తమ సమస్యలను స్వయంగా జిల్లా ఎస్పీకి విన్నవించుకున్నారు. ఎస్పీ వారి సమస్యలు క్షుణంగా విని, ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి స్పందన ద్వారా వచ్చిన ఫిర్యాదులపై చట్టపరంగా విచారణ జరిపి, నిర్దిష్ట గడువులోపు సమస్యలను పరిష్కరించి, బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగే స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రజలు వారి సమస్యలు స్వేచ్ఛగా విన్నవించు కోవచ్చునని, వాటిపై చట్టపరిధిలో విచారణ జరిపి నిర్ణీత గడువులోపు పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు. స్పందన కార్యక్రమంలో వివిధ సమస్యలతో 47 మంది ఎస్పీకి వారి సమస్యలు విన్నవించుకున్నారు. ఈ స్పందన కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి మహేష్, స్పందన సెల్ ఇన్‌స్పెక్టర్ వి మాలకొండయ్య పాల్గొన్నారు.

దేవస్థానంలో అన్నదానం

ప్రజాశక్తి-సిఎస్.పురం

మండల పరిధిలోని మిట్టపాలెం నారాయణ స్వామి దేవస్థానం వద్ద నెల్లూరు జిల్లా సీతారామపురం మండలం సంగసానిపల్లి గ్రామానికి చెందిన జమకాల బాలనారాయణ, లక్ష్మీదేవి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయల సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ ఆదాయం రూ.2,16,461

మిట్టపాలెం నారాయణస్వామి వారి ఆదివారం ఆదాయం రూ.2,16,461 వచ్చినట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి ఎస్ .నారాయణరెడ్డి తెలిపారు. దర్శన టిక్కెట్ల ద్వారా రూ.80,170, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.29,745, మహాప్రాకార నిర్మాణానికి విరాళంగా రూ.55,348, అన్నదానానికి విరాళంగా రూ.43,198, ఇతర విరాళాల ద్వారా రూ.8వేలు వచ్చినట్లు ఆయన తెలిపారు.

రెడ్‌క్రాస్ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

అంకిత భావంతో ప్రజలకు ఉత్తమ సేవలు అందిం చడానికి రెడ్ క్రాస్ సంస్థ ముందుంటుందని రెడ్ క్రాస్ జిల్లా అధ్యక్షులు, జిల్లా కలెక్టరు పి రంజిత్ బాషా అన్నారు. అంతర్జాతీయ రెడ్ క్రాస్ సంస్థ 160వ వ్యవస్థాపక దినోత్స వానిన స్పందన సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. తొలుత రెడ్‌క్రాస్ వ్యవస్థాపకులు హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. నివాళులర్పించిన వారిలో సంయుక్త కలెక్టర్ శ్రీధర్, డిఆర్ఒ లక్ష్మీశివజ్యోతి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయమ్మ ఉన్నారు. రెడ్ క్రాస్‌లోకి రెండు వందల మందిని జీవిత సభ్యత్వం చేయించిన బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి గంధం రవీందర్, ప్యాట్రన్ సభ్యులుగా చేర్చిన వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాస్‌రావు, ఎన్‌సిసి అధికారి కత్తి శ్రీనివాస్‌రావు, ఇటిసి ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ రెడ్ క్రాస్ సభ్యులు జాన్‌వెస్లీలను కలెక్టర్ అభినం దించారు. సంస్థ ఛైర్మన్ నారాయణ భట్టు, నవనీత కృష్ణ, రామచంద్రమూర్తి, వెంకటేశ్వర్లు, గోపీ కృష్ణ, నాగమణి, కుమారి పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయాలి

యర్రగొండపాలెం : వికలాంగుల పెన్షను రూ6 వేలకు పెంచాలని కోరుతూ ఈ 17న ఒంగోలులో మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్మా రాజయ్య తెలిపారు. వికలాంగుల సంఘం ముఖ్యనాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వికలాంగులకు పెన్షను ఒక్క రూపాయ కూడా పెంచలేదన్నారు. వికలాంగులను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిదని ఆవేదన వ్యక్తం చేశారు. మహాధర్నాలో వికలాంగు లందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు పాలంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యకర్తలకు అవగాహన

ప్రజాశక్తి-పెద్దారవీడు

పెద్దారవీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్ హెచ్‌ఫిలకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు గర్భిణులను సకాలంలో గుర్తించి 12 వారాల లోపు ఆర్‌సిహెచ్‌పోర్టల్‌లో వారి వివరాలు నమోదు చేయాలన్నారు. అలా చేయని వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ సుభాని, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

1998 డిఎస్‌సి కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

1998 డిఎస్సీ ఉపాధ్యాయుల సంఘ సమావేశం నగరంలోని ఎస్సార్ విద్యా సంస్థలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అందులో జిల్లా అధ్యక్షునిగా ఎం బాలిరెడ్డి, గౌరవ అధ్యక్షులుగా పి వీరయ్య, ప్రధాన కార్యదర్శిగా మండవ సుబ్బా రావు, మరో 15 మంది సభ్యులను ఎన్నుకున్నా రు. సమావేశంలో వివిధ అంశాలపై తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపిపి మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

ప్రజాశక్తి-ముండ్లమూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 11గంటలకు ఎంపిపి సుంకర సునీత అధ్యక్షతన జరుగుతుందని ఎంపిడిఓ కె కుసుమకుమారి తెలిపారు. ఈ సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచ్‌లు అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

చోరీకి పాల్పడిన నిందితులు అరెస్టు

రూ.10.67 లక్షల సొత్తు స్వాధీనం - జిల్లా ఎస్పి మల్లికగర్గ్

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

బంగారం దుకాణంలో చోరీకి పాల్పడినవారిని అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పి మల్లికగర్గ్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.10.67 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్పి కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలిపిన వివరాల మేరకు.. నెల్లూరు జిల్లాకు చెందిన ఓ బాలుడు ఒంగోలు గాంధీ రోడ్డులోని శ్రీ శాంతి జ్యూయలరీ షాపు భవనంపై కప్పులో ఉన్న తాళం వేయని తలుపు తెరిచి మెట్ల ద్వారా బంగారు దుకాణంలోకి వచ్చి కింద ఫ్లోర్‌లో ఉన్న సుమారు 70 గ్రాముల 20 జతల కమ్మలు, 130 గ్రాముల పాత ఆభరణాలు, కౌంటర్‌లోని 50 వేల రూపాయల నగదు చోరీకి పాల్పడినట్లు తెలిపారు. ఈ కేసులో ప్రతిభ చూపిన 1 టౌన్ సిఐ టి వెంకటేశ్వర్లు, ఎస్ఐ యువి క్రిష్ణయ్య, ఎఎస్ఐ ఎం సాయిక్రిష్ణ, సిబ్బందిని అభినందించడంతో పాటు వారికి రివార్డును అందచేశారు.



వన్ టౌన్ సిఐ టి వెంకటేశ్వర్లును అభినందిస్తున్న ఎస్పి మల్లికగర్గ్

యువకుడు హత్య

ప్రజాశక్తి-ముండ్లమూరు

ముండ్లమూరు గ్రామంలో ఆదివారం రాత్రి యువకుడు హత్య జరిగిన సంఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతమాగులూరు గ్రామానికి చెందిన కారుసాల వెంకటరెడ్డి(32) హత్యకు గురైనట్లు ఎస్ఐ ఎల్ సంపత్‌కుమార్ తెలిపారు. ముండ్లమూరు గ్రామ శివారులోని సోమేపల్లి కోటేశ్వరరావు పొగాకు బ్యారన్ వద్ద వెంకటరెడ్డి మృతదేహం ఉన్నట్లు గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం తెలిపారన్నారు. శుక్రవారం నుంచి గ్రామంలో నాగార్తమ్మ తల్లి కొలుపులు జరుగుతుండగా ఆదివారం చివరిరోజు సంతమాగులూరు, రొంపిచర్ల, వినుకొండ మండలాల నుంచి భారీగా జనం వచ్చి అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారని, ఆదివారం రాత్రి సమయంలో సంతమాగులూరు నుంచి వచ్చిన యువకులు మద్యం సేవించి వెంకటరెడ్డిని హత్య చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒడిస్సా విద్యార్థి దుర్మరణం

ఎనిమిది మందికి గాయాలు

ప్రజాశక్తి-బేస్తవారిపేట

బేస్తవారిపేట పట్టణ సమీపంలోని అమరావతి-అనంతపురం జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో ఒడిస్సాకు చెందిన విద్యార్థి దుర్మరణం చెందాడు. కంభం వెళ్లే మార్గంలో పాత శ్రీ వెంకటేశ్వర థియేటర్ ప్రదేశం మలుపు వద్ద ఒడిస్సా నుంచి బేస్తవారిపేటలో బిఇడి పరీక్షలు రాసేందుకు రెండు ఆటోలలో వస్తున్న విద్యార్థులను ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆటోలోని మొత్తం ఎనిమిది మందికి తీవ్ర గాయాలు కాగా మరో విద్యార్థి అలుకు రంజాన్ స్వాన్(25) తీవ్రంగా గాయపడి అక్కడిక్కడే మృతి చెందాడు. ప్రయాణికులలో మృతుడు, మరో ఆరుగురు ఒరిస్సాకు చెందిన బీఈడీ విద్యార్థులు కాగా మరో ఇద్దరు ఆటో డ్రైవర్లు. ఒరిస్సాకు చెందిన బిఈడి విద్యార్థులు పరీక్షలు రాసేందుకు రాత్రి కంభం నుంచి బేస్తవారిపేటకు ఆటోలలో వస్తున్న క్రమంలో ఈ సంఘటన జరిగింది. గాయపడ్డ వారిని స్థానికులు కంభం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై బేస్తవారిపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

బాలికపై వృద్ధుడి అఘాయిత్యం

ప్రజాశక్తి-పెద్దారవీడు

పెద్దారవీడులో దారుణం చోటుచేసుకుంది. తొమ్మిదేళ్ల బాలికపై వృద్ధుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. విషయం తెలుసుకున్న పోలీసులు విచారణ చేసి.. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పెద్దారవీడులో నివాసం ఉంటున్న తొమ్మిదేళ్ల చిన్నారి అదే గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. చిన్నారి తల్లి 11 నెలల క్రితం కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకుంది. పెద్దారవీడులోని అమ్మమ్మ ఇంటిలో చిన్నారి ఉంటోంది. గత శనివారం పెద్దారవీడు సమీపంలోని అంకాళమ్మ గుడికి కొద్ది దూరంలో నూతనంగా శ్రీవెంకటేశ్వర స్వామి గుడి నిర్మాణం చేపట్టారు. అక్కడ ప్రత్యేక వేడుకలు జరిపారు. ఆ వేడుకలకు చిన్నారితో పాటు అమ్మమ్మ కూడా వెళ్లింది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటికి వచ్చే సమయంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. అదే వేడుకకు సైకిల్‌పై వెన్నా చెంచిరెడ్డి(65) వచ్చాడు. చిన్నారిని సైకిల్‌పై ఇంటికి తీసుకెళ్లాలని చెంచిరెడ్డిని బాలిక అమ్మమ్మ కోరింది. చిన్నారి అమ్మమ్మ మాత్రం నడుచుకుంటూ వస్తోంది. సైకిల్‌పై ఎక్కించుకున్న చిన్నారిని చెరువు సమీపంలోని చిల్లచెట్ల వద్ద దించాడు చెంచిరెడ్డి. కంప చెట్లలోకి తీసుకెళ్లాడు. సైకిల్‌ను మాత్రం రోడ్డు సమీపంలో ఉంచాడు. అక్కడ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. చిన్నారిని కేకలు వేస్తే చంపేస్తానని బెదిరించినట్లు తెలిసింది. అదే మార్గంలో చిన్నారి అమ్మమ్మ నడుస్తూ రావడంతో సైకిల్ కనిపించింది. చెంచిరెడ్డి సైకిల్ ఇక్కడ ఉందేమని వెదికింది. చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన చెంచిరెడ్డికి స్థానికుల సాయంతో దేహశుద్ధి చేసింది. ఈ విషయం ఊరంతా తెలియడంతో పెద్దలు కొందరు సర్దుకుపోవాలని బాధితులకు సూచించినట్లు తెలిసింది. ఈ విషయం పోలీసులకు చేరింది. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలలో పెద్దారవీడు ఎస్ఐ పులి రాజేష్ లైంగిక దాడికి గురైన బాలికను విచారించారు. జరిగిన విషయం తెలుసుకున్నారు. చిన్నారిని వైద్య పరీక్షల నిమిత్తం మార్కాపురంలోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. నిందితుడు చెంచిరెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. చిన్నారి సంరక్షకుల ఫిర్యాదుతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

ఉపాధ్యాయుడి ఆత్మహత్య కలకలం

- చెరువులో వెతికినా కనిపించని ఆచూకీ
- పట్టణంలో తిరుగుతుండటంతో ఇంటికి తీసుకొచ్చిన కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-మార్కాపురం (ప్రకాశం జిల్లా)



చెరువు గట్టుపై దుస్తులు, సూసైడ్ నోట్

స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల మ్యాథ్స్ టీచర్ రాజారపు లక్ష్మయ్య చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నారనే ప్రచారం మార్కాపురం పట్టణంలో కలకలం రేపింది. సోమవారం ఉదయం మార్కాపురం చెరువు వద్ద ఉపాధ్యాయుడు లక్ష్మయ్య అప్పుల బాధతో తాను చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు లేఖ రాసి.. తన చెప్పులను, దుస్తులను ఒడ్డున ఉంచారు. తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు వాట్సప్ గ్రూపుల్లోనూ పంపారు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. కంగారుగా చెరువు వైపు పరుగులు తీశారు. పట్టణ ఎస్ఐ శశికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు నీటిలో గాలించారు. చెప్పులు, దుస్తులు, సూసైడ్ నోట్ ఉన్న ప్రదేశంలో లక్ష్మయ్య కనిపించకపోవడంతో వెనుదిరిగారు. కుటుంబ సభ్యులు మాత్రం పట్టణంలో వెతుకుతుండగా పట్టణంలోని డ్రైవర్స్ కాలనీ సమీపంలో మాస్క్ పెట్టుకుని నడుచుకుంటూ వెళుతుండటాన్ని గమనించారు. అతడిని ఇంటికి తీసుకెళ్లారు. లక్ష్మయ్య అలా ఎందుకు చేయవలసి వచ్చిందో పోలీసులు విచారణ చేస్తున్నారు.



ఇంటిని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

40 ఏళ్ల వ్యాజ్యం

ఇల్లు సొంతోళ్లకు అప్పజెప్పాలని తీర్పు ఇచ్చిన కోర్టు

ప్రజాశక్తి-వేటపాలెం

మండలంలో పట్టణ నడిబొడ్డున 40 ఏళ్ల నుంచి కోర్టు వివాదంలో ఉన్న ఇంటికి ఎట్టకేలకు మోక్షం లభించింది. చీరాల సివిల్ కోర్టు ఉత్తర్వుల మేరకు సోమవారం కోర్టు సిబ్బంది ఆధ్వర్యంలో వేటపాలెం పోలీసుల ప్రొటక్షన్లో ఇంటిని స్వాధీనం చేసుకుని వారసులకు అప్పగించారు. వివరాల ప్రకారం.. వేటపాలెం పట్టణం నడిబొడ్డున 45 ఏళ్ల క్రితం ఓ ఇంటిలో అద్దెకు దిగారు. కాలక్రమంలో ఆ ఇల్లు తనదంటూ కోర్టులో కేసు వేశారు. సొంతదారులు చేసేది ఏమీ లేక వారు కూడా కోర్టును ఆశ్రయించారు. కోర్టుకెక్కిన వాళ్లు కాలక్రమంలో గతించారు. అయితే వారి వారసులు మాత్రం పోటాపోటీగా కోర్టుల చుట్టూ తిరిగారు. ఎట్టకేలకు అర్హులైన వారికే ఆ ఇల్లు స్వాధీనం చేసే విధంగా కోర్టు తీర్పు ఇవ్వటంతో పోలీసుల ప్రొటక్షన్ మధ్య కోర్టు సిబ్బంది ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారుల పంచనామాలతో ఇంటిని స్వాధీనం చేసుకుని వారసులకు అప్పగించారు. ఈ సంఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది.

భట్టిప్రోలు పెట్రోలు బంక్‌లో చేతివాటం

ప్రజాశక్తి-భట్టిప్రోలు



పెట్రోలు బంక్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వినియోగదారులు

వాహనదారులకు నాణ్యమైన సేవలు అందించాల్సిన పెట్రోలు బంక్ సిబ్బంది తమ చేతి వాటం ప్రదర్శించి నిలువునా దోపిడీకి గురి చేస్తున్నారు. భట్టిప్రోలు మార్కెట్ యార్డ్ వద్ద గల హెచ్‌పి బంక్ పరిస్థితి మరింత దారుణంగా మారింది. సోమవారం ఒక వ్యక్తి వంద రూపాయలు ఇచ్చి ఆయిల్ కొట్టించాడు. అతను భట్టిప్రోలు నుంచి వెల్లటూరు వెళ్లి వచ్చేసరికి ఆయిల్ అయిపోయింది. మొత్తం 10 కిలో మీటర్లు కూడా తిరగక ముందే ఆయిల్ అయిపోవడంతో ఆందోళనకు గురయ్యాడు. దీంతో బంక్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. అదే సమయంలో అక్కడ ఉన్న కొందరు వినియోగదారులు కూడా తమను మోసం చేస్తున్నారని సిబ్బందిపై విరుచుకుపడ్డారు. బంక్ యజమానిని పిలిపించాలని పట్టుపట్టా రు. హడావుడిగా వివిధ పనులపై వెళుతూ ఆయిల్ పోపించుకోవడానికి బంక్‌కు వచ్చి వంద, రెండు వందలకు ఆయిల్ కొట్టమని బైకు ట్యాంక్ మూత తీసి జేబులో డబ్బులు తీసేసరికి ఆయిల్ కొట్టటం అయిపోతుంది. పని హడావిడిలో ఉన్న వాహనదారు సొమ్ము ఇచ్చి వెళ్లిపోతూ ఉంటారు. తీరా చూస్తే పది నుంచి ఇరవై కిలోమీటర్లు వెళ్లే సరికి ఆయిల్ అయిపోతుంది. దీంతో కొందరు బండి బోరుకు వచ్చి ఆయిల్ మైలేజీ రావటం లేదని, మరికొందరు దీనిని గమనించకుండా ఆయిల్ అయిపోందని, మరోమారు ఆయిల్ కొట్టించు కుంటున్నారు. ఇలాంటి పరిస్థితిలో ఇంకొందరు ప్రత్యేకించి పోసిన ఆయిల్ ఎంత? ఎంత మిలేజీ వచ్చింది అనేది గమనిస్తూ ఉంటారు. అలాంటి వ్యక్తికి అర్థమవుతుంది. ఆయిల్ తక్కువ వచ్చిందని. పెరిగిన వాహనాల వినియోగంతో పాటు బంక్‌లు కూడా పెరిగాయి. పెట్రోలు బంక్‌ల వ్యాపారం బాగా లాభసాటిగా ఉండటం తో ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. కొల్లూరు నుంచి భట్టిప్రోలుకు మధ్య దాదాపుగా 8 బంక్‌లు ఉన్నాయంటేనే పరిస్థితి ఇట్టే అర్థమౌ తుంది. ఆయిల్ బంక్‌లో నాణ్యతా ప్రమాణాలు, కొలతలు, వినియోగదారులకు అందించాల్సిన సేవలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో ముంగటం వలననే బంక్‌లో ఇలాంటి అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి బంక్‌లలో జరిగే అవినీతి అక్రమాలపై విచారించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పసుపుకు రూ.10 వేల గిట్టుబాటు ధర ఇవ్వాలి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

వర్షాలకు తడిసి దెబ్బతిన్న పసుపు పంటను ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాల ద్వారా క్వింటా రూ.10 వేలకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షులు వేములపల్లి వెంకట్రామయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పెదలంక గ్రామ సచివాలయంలో వినతిపత్రం అందజేశారు. నిరంతరం కురుస్తున్న వర్షాలకు పసుపు రంగు మారిందని, క్వింటా ధర రూ.4 వేలకు మించి లేకపోవటం వలన రైతులు ఎకరాకు రూ.70 వేలకు పైగా నష్టపోతున్నారని ఆ వినతిపత్రంలో తెలిపారు. తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి కె రామస్వామి, బిఎల్ కె ప్రసాద్ ఉన్నారు.

గ్రంథాలయంలో 'ఉయ్ లవ్ రీడింగ్'


ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకి ప్రభుత్వ శాఖా గ్రంథాలయంలో గ్రంథ పాలకుడు సిహెచ్ సుగుణరావు ఆధ్వర్యంలో సోమవారం పాఠశాల విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఉయ్ లవ్ రీడింగ్ కార్యక్రమాన్ని సీనియర్ రొటేరియన్ విద్వాన్ జ్యోతి చంద్రమౌళి ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా అద్దంకి మండల విద్యాశాఖ అధికారి పివి రాఘవరావు, రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసరావు, రోటరీ సభ్యులు డాక్టర్ ఉబ్బా దేవపాలన, అద్దంకి లేవి ప్రసాద్, చప్పిడి వీరయ్య, ఉపాధ్యాయులు అన్వర్‌బాషా, రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గుడి కంటే గ్రంథాలయం పవిత్రమైనదని అన్నారు. ప్రతిరోజూ గ్రంథాలయానికి వచ్చి, పుస్తకాలు, వార్తపత్రికలు చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. పుస్తక పఠనం ద్వారా విద్యార్థులకు ఎంతో ప్రయోజనం ఉంటుందని, ప్రతి ఒక్క విద్యార్థి పుస్తక పఠనంతో ప్రపంచంలోని ప్రతి విషయాన్ని తన జ్ఞాన సంపదతో ముడిపడి ఉండే విధంగా భవిష్యత్తులో ఎలాంటి ప్రశ్నలకు కూడా సమాధానం దొరికే అవకాశం ఉందన్నారు. టీవి, సెల్, సినిమా కల్చర్ మానుకొని, బుక్ కల్చర్ పెంచుకోవాలని ఉద్బోధించారు.

కూకట్లపల్లి భూములు దళితులకే ఇవ్వాలి

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల జిల్లా బల్లికురవ మండలం కూకట్లపల్లి, గొర్రెపాడు దళితుల భూములు దళితులకే ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య డిమాండ్ చేశారు. సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దళితుల భూములు దళితులకు ఇవ్వాలని కోరుతూ జిల్లా కలెక్టరుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ గత 30 యేళ్లకు పూర్వం కూకట్లపల్లి, గొర్రెపాడు గ్రామ దళితులకు అప్పట్లో అటవీ భూములను డీనోటిఫై చేసిన భూములు దళితులకు హక్కు కల్పిస్తూ పాస్ పుస్తకాలు లబ్ధిదారులకు అందజేశారు. గ్రామంలో అగ్రవర్ణ రెడ్డి కులస్తులు దళితుల వద్ద ఉన్న భూములను దౌర్జన్యంగా ఆక్రమించుకొని సాగు



కలెక్టర్ కార్యాలయం వద్ద దళితులు ప్రజాసంఘాల నాయకులు

చేసుకున్నారని పేర్కొన్నారు. బాపట్ల జిల్లా ఏర్పడ్డాక జిల్లా కలెక్టర్ నుంచి మండల స్థాయి అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. గతంలో చేసిన పోరాటాల ఫలితంగా అక్రమంగా సాగులో ఉన్న వారికి పేరుకు మాత్రమే నోటీసులు ఇచ్చారు. భూములు ఖాళీ చేయించలేదు. ఇప్పటికైనా నూతనంగా వచ్చిన కలెక్టర్ చొరవ చూపి దళితుల భూములను అక్రమంగా అనుభవిస్తున్న పెత్తందారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణమే గ్రామంలో దళితులకు భూముల అప్ప చెప్పాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి కృష్ణమోహన్, ఉపాధ్యక్షులు తంగిరాల వెంకటేశ్వర్లు, బల్లికురవ మండల కార్యదర్శి గొల్లపూడి అంజయ్య, భూ పోరాట కమిటీ నాయకులు వేల్పుల యోబు, తంగిరాల రాణమ్మ, తంగిరాల సామేలు, ఎం బాలేంద్ర, అంజిబాబు, యోహాను, నాగేంద్రం, బాబు, దళిత రైతులు పాల్గొన్నారు.

డిప్యూటీ జనరల్ సెక్రెటరీగా కుమారి నంద

ప్రజాశక్తి-సంతమాగులూరు



ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఏపీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీగా, మండలంలోని ఏల్చూరు గ్రామానికి చెందిన యువ మహిళా న్యాయవాది పర్చూరు కుమారి నంద ఎన్నికయ్యారు. ఈ నెల 7వ తేదీ ఆదివారం నాడు రాజమండ్రి లోని రివర్ వే కన్వెన్షన్ హాలులో జరిగిన ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ 11వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహాసభల్లో ఐఏఎల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీగా కుమారి నంద ఎన్నికయ్యారు. ప్రస్తుతం కుమారి నంద గుంటూరులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. గుంటూరు బార్ అసోసియేషన్‌లో లేడీ ఎగ్జిక్యూటివ్ ప్రస్తుతం పని చేస్తున్నారు. 27 సంవత్సరాల అతి చిన్న వయసులో 40 ఏళ్ల చరిత్ర కలిగిన ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ సంఘానికి కుమారి నంద రాష్ట్రస్థాయిలో ఎన్నిక అవటం పట్ల నంద తల్లిదండ్రులు, ఏల్చూరు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

వేసవి విజ్ఞాన తరగతులు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ఈ నెల 8 నుంచి మటూరు శాఖ గ్రంథాలయంలో ప్రారంభమైన వేసవి విజ్ఞాన తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని భట్టిప్రోలు గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్మయి సూచించారు. సోమవారం ఈ శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 11 వ తేదీ వరకు కొనసాగే ఈ శిక్షణా తరగతులలో పుస్తక పఠనం, కథలు చెప్పుట, వినుట, చిత్రలేఖనం వంటి పలు అంశాలలో శిక్షణ ఉంటుందని తెలిపారు. 6 నుంచి 10 వరకు చదివే విద్యార్థులు విరివిగా పాల్గొని సృజనాత్మకతను వెలికి తీయాలని కోరారు. ఏ కార్యక్రమంలో లైబ్రేరియన్ కలపాల సుభాష్ చంద్రబోస్, బొలిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు చెన్నయ్య తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండలంలోని పెదపులివర్రు గ్రామంలో సోమవారం మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను ఎంపిపి డివి లలితకుమారి ప్రారంభించారు. ఈ ఏడాది మొక్కజొన్న పంటల కారణంగా పనుల ప్రారంభంలో జాప్యం జరిగిందని, ఇప్పటి నుంచి ప్రతి రోజూ పనులు సక్రమంగా జరగాలని, అధికారులు పాల్గొని నియమ నిబంధన, కొలతల ప్రకారం జరిపించాలని సూచించారు. దినసరి వేతనంగా రూ.270 లభిస్తున్న దృష్ట్యా ప్రతి జబ్ కార్డ్ హోల్డర్ పనులలో పాల్గొనాలని కోరారు. ఏ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు, మేట్లు, నాయకులు మల్లేశ్వరరావు తదితరులు ఉన్నారు.

జడ్‌పి విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-రేపల్లె

పదో తరగతి పరీక్షా ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన మండలంలోని పెటేరు జడ్పి హైస్కూల్ విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు పావులూరి కృష్ణ మోహన్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాపించిన నాటి నుంచి నేటి వరకు అటు రాష్ట్ర స్థాయిలోనూ, ఇటు జిల్లా స్థాయిలోనూ అత్యధిక మార్కులు 591, 579, 572 సాధించటం గర్వకారణమని అన్నారు. 16 మంది విద్యార్థులు 500 మార్కులు పైబడి సాధించి చరిత్ర సృష్టించారని తెలిపారు. ఈ మేరకు విద్యార్థులకు స్వీట్స్ తినిపించి ఆశీస్సులు అందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలు చేరుకుని తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆశీర్వదించారు. ఇంతటి ఘన విజయం సాధించేందుకు కృషి చేసిన పాఠశాల ఉపాధ్యాయులకు విద్యార్థులకు, తల్లిదండ్రులకు గ్రామ సర్పంచ్ కనపర్తి వసుమతి, కనపర్తి రవికిరణ్, వైస్ ఎంపీపీ రావు నెహ్రూ లక్ష్మి, రావు ప్రభాకర్‌రావు, గ్రామపెద్దలు అభినందనలు తెలిపారు.

తడిసిన మొక్కజొన్నను కొనుగోలు చేస్తాం

ప్రజాశక్తి-కొల్లూరు

తడిసిన మొక్కజొన్నను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి షేక్ అబ్దుల్ సత్తార్ అన్నారు. ఆదివారం మండలంలోని కొల్లూరు, రావికంపాడు, చిన్న పులివర్రు గ్రామాల్లో వర్షాలకు తడిసిన మొక్కజొన్నను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏవో వెంకటేశ్వరరావు, కొల్లూరు తహశీల్దారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి-పంగులూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని, ప్రజలకు ఈ పథకాల గురించి తెలియజేసి, ఈ పథకాల ఉపయోగాలను గురించి కూడా ప్రజలకు తెలియజేయాలని, వైసిపి అద్దంకి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, శాప్ నెట్ చైర్మన్ చైర్మన్ బాచిన కృష్ణ చైతన్య అన్నారు. సోమవారం పంగులూరులోని స్త్రీ శక్తి భవనంలో, వైఎస్సార్ కాంతి పథకం సిబ్బంది, విఓఏలతో బాచిన కృష్ణ చైతన్య సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చైతన్య మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని రకాల సంక్షేమ పథకాలను ప్రజలకు చేరేలా చూడాలని కోరారు. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం, వైఎస్సార్ చేయూత పథకం, జగనన్న తోడు, మొదలైన సంక్షేమ పథకాలన్నింటిలో పార్టీలకు అతీతంగా పారదర్శకంగా సిబ్బంది పనిచేయాలని సూచనలు చేశారు. పనిచేసే క్రమంలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

వర్షాలకు దెబ్బతిన్న పసుపు పంట

ప్రజాశక్తి-కొల్లూరు: గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పసుపు పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. కొల్లూరు మండల పరిధిలోని లంక గ్రామాలలో పసుపు ఎక్కువగా సాగు చేస్తారు. గతేడాదితో పోల్చుకుంటే ఈ సంవత్సరం గిట్టుబాటు ధర చాలా తక్కువే. పోయిన సంవత్సరం 75 కేజీల పచ్చి పసుపు బస్తా వెయ్యి రూపాయలు కొంటే ఈ సంవత్సరం 500 రూపాయలకు కూడా కొనడం లేదు. ఒక ఎకరంలో పసుపు పండించాలి అంటే రూ.20,000 నుంచి రూ.30,000 వేలు ఖర్చు అవుతుంది. ఇలాంటి తరుణంలో పండిన పంటకు రేటు లేకపోవడం వలన చిన్న, సన్న కారు రైతులు పసుపును ఎక్కువ శాతం పండించారు. ఇలా ఎండిన పసుపును దుగ్గిరాల పసుపు యార్డుకి తరలించి రేటు వచ్చినప్పుడు రైతులు అమ్ముకుంటూ ఉంటారు. ఇలాంటి తరుణంలో కల్లాల్లో ఎండుతున్న పసుపుకు అకాల వర్షాలు తీవ్ర నష్టం కలిగించాయి. ఎండిన పసుపు తడిస్తే సింధూరంగా మారితే కొనుగోలుదారులు రారేమోనని రైతులు ఆవేదన చెందుతున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ధోరణి సరికాదు

సర్పంచుల సంఘం నిరసన

ప్రజాశక్తి-బాపట్ల: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ ధోరణితో సర్పంచులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడుతోందని సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి టి కృష్ణమోహన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శొంఠి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం బాపట్లలో వారు విలేకరులతో మాట్లాడారు. ప్రకాశం జిల్లా దర్శి మండలం రామచంద్రపురం వైసీపీ సర్పంచ్ ధనలక్ష్మి ఆత్మహత్య ముమ్మాటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన హత్యలే అన్నారు. ఆమె ఆత్మహత్యకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బాధ్యత వహించాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న ధనలక్ష్మి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి నష్టపరిహారం తక్షణమే చెల్లించాలన్నారు. రాష్ట్రంలోని 12 వేల 918 మంది సర్పంచుల బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. ధనలక్ష్మి ఆత్మహత్య లాంటి పరిస్థితులే తిరిగి రాష్ట్రంలో పునరావృతం అయ్యే ప్రమాదం ఉందన్నారు. రామచంద్రపురం పంచాయతీ సర్పంచ్ బాదం ధనలక్ష్మి చేసిన పనులకు బిల్లులు రాక, గ్రామాభివృద్ధి కోసం చేసిన అప్పులు, వడ్డీలు బాధలు తాళలేక ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా సర్పంచుల సమస్యలపై దృష్టి సారించి, చేసిన పనులకు పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోరారు.

ఏడాదిగా అందని సాయం

ప్రజాశక్తి-రేపల్లె

గత ఏడాది వీచిన తుఫాన్ గాలులు, వర్షాలకు దెబ్బ తిన్న వాణిజ్య పంటల రైతులకు ఇంతవరకు ప్రభుత్వం సాయం అందించలేదని ఏపి రైతుసంఘం బాపట్ల జిల్లా అధ్యక్షుడు వి వెంకటరామయ్య సోమవారం రేపల్లె ఆర్‌డిఒ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం సంభవించిన తుఫాన్ గాలులకు పంట నష్టం జరిగిన లంక గ్రామాల రైతులకు పరిహారం చెల్లించకపోవటం దారుణం అన్నారు. వాణిజ్య పంటలైన అరటి, పసుపు, కంద, కూరగాయలు, పంటలకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ఏడాది మే నెలలో లంక గ్రామాల్లో పర్యటించిన అప్పటి జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు పడిపోయిన తోటలను పరిశీలించి పరిహారం అందిస్తామని వాగ్దానాలు చేసి సంవత్సరం గడుస్తున్నా రైతులకు ఇంతవరకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదన్నారు. లక్షలాది రూపాయలు నష్టపోయినా, రైతులకు పరిహారం ఇవ్వకుండా మాటలు చెపుతూ ప్రభుత్వం మాయ చేస్తోందని విమర్శించారు. ప్రస్తుతం కురిసిన అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ప్రభుత్వం స్పందించి గత సంవత్సరం నష్టపరిహారం వెంటనే చెల్లిచాలని కోరారు.

ప్రస్తుత పంట నష్టం నమోదు చేసి తడిచిన జొన్న, ధాన్యంను మద్దతు ధరలకు కొనుగోలుచేసి ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు బిఎల్‌కే ప్రసాద్, సిపిఎం కార్యదర్శి సిహెచ్ మణిలాల్, కె ఆశీర్వాదం, పి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఉసురు తీస్తున్న వైసిపి ప్రభుత్వం

అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-అద్దంకి

పెండింగ్ బిల్లులు రాక ఉమ్మడి ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గం రామచంద్రాపురం గ్రామానికి చెందిన అధికారపార్టీ మహిళా సర్పంచి ఉరేసుకుని తనువు చాలించారని, ఇది ముమ్మాటికీ జగన్‌రెడ్డి చేసిన హత్యలేనని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సక్రమంగా జీతాలు అందక ఉపాధ్యాయులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. గతంలో 43 శాతం పిఆర్‌సి ఇస్తే తప్పుబట్టిన జగన్ రెడ్డి నేడు అసలు వేతనాలకే ఎసరు పెట్టాడని అన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రివర్స్ పాలన తప్ప పురోభివృద్ధి లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ చరిత్రను జగన్‌రెడ్డి దిగజార్చారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా జీతాలు తగ్గేలా, ఉద్యోగుల నుంచి బకాయిలు వసూలు చేసేలా జీవోలు ఇచ్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అని అన్నారు. బడిలో పిల్లలకు పాఠాలు చెబుతూ ఉపాధ్యాయులు, ప్రజలకు అవసరమైన సేవలు చేస్తూ ఉద్యోగులు బిజీగా ఉండాల్సింది పోయి మా పొట్ట కొట్టొద్దు అంటూ రోడ్డెక్కే పరిస్థితిని జగన్ రెడ్డి



తీసుకువచ్చారన్నారు. ఆదాయం కోసం ఉపాధ్యాయులతో మద్యం అమ్మించారని, ప్రశ్నిస్తే వేధింపులకు గురి చేశారని పేర్కొన్నారు. నాడు నేడు పేరుతో కోవిడ్ సమయంలో పాఠశాలలు నిర్వహించి వందలాది మంది ఉపాధ్యాయుల మరణాలకు కారకులయ్యారని పేర్కొన్నారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం గత రెండున్నరేళ్లలో ఒక్క హామీని కూడా అమలు చేయకుండా ఉద్యోగులకు మొండిచేయి చూపిందని అన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేస్తానని జగన్ అనేకసార్లు ప్రకటించారని అన్నారు. అది నేటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. వారి ఆశలకు జగన్ సమాధి కట్టారని విమర్శించారు. ఉద్యోగులందరూ ఏకతాటిపైకి రావాలని, భవిష్యత్‌లో జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఐఆర్ కంటే పీఆర్సీ తక్కువ చరిత్రలో ఎప్పుడూ లేదని, రివర్స్ పీఆర్సీపై జీవోను విడుదల చేసి జగన్‌రెడ్డి చరిత్ర హీనుడిగా నిలిచారన్నారు. వైసీపీ సర్పంచ్ ధనలక్ష్మి ఆత్మహత్య ముమ్మాటికీ రాష్ట్ర ప్రభుత్వం హత్యే ఈ ఆత్మహత్యకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బాధ్యత వహించాలని ఎమ్మెల్యే రవికుమార్ డిమాండ్ చేశారు. అకాల వర్షాల కారణంగా నియోజకవర్గ వ్యాప్తంగా రైతులందరూ తీవ్రంగా నష్టపోయారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మార్క్‌ఫెడ్ ద్వారా తడిసిపోయిన మొక్కజొన్న, పసుపు సేకరించి, గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే కోరారు. రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతతో వ్యవహరించి తక్షణమే యుద్ధ ప్రాతిపదికన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమం చేసేందుకు వెనుకాడబోమని ప్రభుత్వాన్ని గొట్టిపాటి హెచ్చరించారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

మంత్రి ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. యర్రగొండపాలెం-2 సచివాలయ పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలు సావధానంగా విని ఎక్కడి సమస్యలను అక్కడే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ప్రతి గడపకూ సంక్షేమ పథకాన్ని అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. పేదల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి సంక్షేమ పాలన సాగిస్తున్నారన్నారు. వాలంటీరు వ్యవస్థతో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలో సంక్షేమ పథకాల నగదును జమ చేస్తున్నామన్నారు. పార్టీలకు, రాజకీయాలకు, కులాలకు, మతాలకు, వర్గాలకు అతీతంగా అర్హులైన



ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి సురేష్

వారందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపిపి దొంతా కిరణ్‌గౌడ్, జడ్‌పిటిసి చేదూరి విజయ భాస్కర్, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సాబీర్ బాషా, సర్పంచి రామావత్ అరుణాబాయి, వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, వైసిపి నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ షేక్ ఖాసింబాషా, గంజివారిపల్లి సర్పంచి దుగ్గెంపూడి సుబ్బారెడ్డి, పిఆర్ డిఇఇ సుబ్బారెడ్డి, డిఎల్‌డిఒ సాయికుమార్, ఎఇ మహాంకాళయ్య, ఎంపిడిఒ రంగ సుబ్బా రాయుడు, తహశీల్దారు దాసు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు. **మర్రిపూడి :** పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని వైసిపి కొండపి



స్థానికులతో మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపాడు. కాకర్ల సచివాలయ పరిధిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు గడప గడపకూ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో చిమట సొసైటీ మాజీ అధ్యక్షుడు మొల్లల శివరామిరెడ్డి, సర్పంచి మేళం శివన్నారాయణ, మండల వైసిపి యూత్ నాయకుడు వనిపెంట మల్లికార్జున, వైసిపి నాయకులు బి. వెంకటేశ్వంర్రాజు, డి. నరసింహారావు, మొల్లల వెంగళరెడ్డి, మొల్లల రామిరెడ్డి, నల్లగట్ల కాశయ్య, జాజుల ప్రసాద్, దుడ్డు యల్లమంద, వైసిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి పట్టణంలోని ఇస్లాం పేటకు గత రెండునెలలుగా సాగర్ నీరు సరఫరా కావడం లేదు. దీంతో ఆగ్రహించిన ఇస్లాం పేట మహిళలు మాజీ ఎంపిటిసి సయ్యద్ ఇమాంసాహెబ్ ఆధ్వర్యంలో సోమవారం రోడ్డెక్కారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ తమ కాలనీకి పైపులైన్ ద్వారా సాగర్ నీరు సక్రమంగా సరఫరా కావడం లేదని తెలిపారు. దీంతో బ్యాంక్ కాలనీ, బీసీ కాలనీకి వెళ్లి నీరు తెచ్చుకుంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. సాగర్ పైపులైను అలంకార ప్రాయంగా మారినా అధికారులు స్పందించ లేదని తెలిపారు. దీంతో గత్యంతరం లేక తాము రోడ్డుపైకి వచ్చినట్లు తెలిపారు. ఇస్లాం పేటలో కొత్తగా సాగర్ నీటికోసం పైపులైను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆ పైపు లైన్ ద్వారా నీరు రావడం లేదని



రాస్తారోకో నిర్వహిస్తున్న మహిళలు

తెలిపారు. మహిళలు రోడ్డుపై బైటాయించడంతో వాహనాలు నిలిచి పోయాయి. సమాచారం అందుకున్న సిఐ రాఘవేంద్ర, ఎస్ఐ మల్లికార్జున ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన కారులతో మాట్లాడారు. అనంతరం ఉన్నతాధికారులతో మాట్లాడి నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం ఆందోళన కారులకు నచ్చజెపి వారి చేత రాస్తారోకోను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వలి, మస్తాన్, కరిమున్, మహిళలు పాల్గొన్నారు.

పశువైద్యశాలలో జేడీ తనిఖీ

ప్రజాశక్తి-టంగుటూరు

అమూల్ పాల కేంద్రాలను అభివద్ధి చేసుకోవడం ద్వారా పాడి రైతులకు ఆర్థిక చేయూత లభిస్తుందని జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ కె. బేబిరాణి తెలిపారు. మండల పరిధిలోని ఎం. నిడమలూరు పశువైద్య కేంద్రాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ వైఎస్ఆర్ చేయూత, బ్యాంకు రుణాల ద్వారా పాడి రైతులకు గేదెలను కొనుగోలు చేయించి తద్వారా వచ్చే పాలను అమూల్ పాల కేంద్రాలకు సరఫరా చేయడం దావర్రా అమూల్ కేంద్రాలు అభివద్ధి సాధిస్తాయిన్నారు. ప్రతి గ్రామంలో అమూల్ కేంద్రాలను తప్పని సరిగా ప్రారంభించాలన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న జేడీ బేబిరాణి

ఇప్పటికే నిర్వహిస్తున్న అమూల్ కేంద్రాలలో పాల సేకరణను మరింతగా పెంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పశు వైద్యశాలలోని రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.నిడమలూరు పశువైద్యాధికారి డాక్టర్ వై.ధనలక్ష్మి, సిబ్బంది ఉన్నారు

విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత : బాలినేని

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, అందుకోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. వైద్యఆరోగ్య శాఖ నిధులు రూ.80 లక్షలు, నగరపాలక సంస్థ నిధులు రూ.48 లక్షలు కలిపి రూ.1.28 కోట్లతో 17వ డివిజన్ ప్రగతి కాలనీలో నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను సోమవారం జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌తో కలిసి బాలినేని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్షాలు అభివృద్ధిలేదని చెబుతున్నారని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యా,



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పనిచేస్తున్నారని తెలిపారు. పేద ప్రజలకు కావాల్సిన విద్య, వైద్యం అందుబాటులో ఉండాలని సిఎం అనేక కార్యక్రమాలు తీసుకు వచ్చారని తెలిపారు. నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అర్బన్ హెల్త్ సెంటర్లు ప్రతి జిల్లాలో నిర్మిస్తున్నారని చెప్పారు. అర్బన్ హెల్త్ సెంటర్‌లో 70 రకాల పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. మందులు కూడా ఉచితంగా ఇస్తారని చెప్పారు. జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ అర్బన్ హెల్త్ సెంటర్‌లో నాణ్యమైన మందులు ఉచితంగా ఇస్తారని తెలిపారు. పరీక్షలన్నీ ఉచితంగానే చేస్తారని చెప్పారు. అందుకు అవసరమైన సిబ్బందిని కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు అర్బన్ హెల్త్ సెంటర్లను వినియోగించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి, 17వ డివిజన్ కార్పొరేటర్ నాగం వెంకటశేషయ్య, ఒడా చైర్మన్ శింగరాజు మీనా కుమారి, కార్పొరేటర్లు యనమల నాగరాజు, తాడి కృష్ణలత, చింతపల్లి గోపి, వైసిపి నాయకులు కటారి శంకర్, గోలి తిరుపతిరావు, అయినా బత్తిన ఘనశ్యాం, ఒంగోలు నగరపాలక సంస్థ ఇంజినీర్ కె మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో తనిఖీ

ప్రజాశక్తి- మద్దిపాడు

మండల పురిధిలోని కొలచనకోట గ్రామ సచివాలయాన్ని గ్రామ సచివాలయవెల్ఫేర్ జిల్లా అధికారి ఉషారాణి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో అనేక అవక తవకలు బయటపడ్డాయి. డిజిటల్‌అసిస్టెంట్ హాజరు టాంపరింగ్ చేసినట్లుగా గుర్తించారు. రూ.40 వేల సర్వీస్ నగదు ప్రభుత్వానికి చెల్లించనట్లుగా గుర్తించారు. స్పందన కార్యక్రమానికి హాజరు కాని వారికి హాజరు కాని వారికి ఆబెసెంట్ వేయలేదని, మూమెంట్ రిజిస్టర్ నమోదు చేయనందున డిఎను సస్పెండ్ చేయాలని పై అధికారులకు సిఫారసు చేశారు. పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు.

టిడిపి జిల్లా అధికార ప్రతినిధిగా నేతి రవికుమార్

ప్రజాశక్తి-కొండపి



తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధిగా కొండపి గ్రామానికి చెందిన నేతి రవికుమార్ నియమి తులయ్యాడు. తన నియామకానికి కృషి చేసిన కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, టిడిపి జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజికి, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్థన్‌రావు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి దామచర్ల సత్యకు కృతజ్ఞతలు తెలిపాడు.

42 పొగాకు బేళ్లు తిరస్కరణ

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరులోని కొండపిరోడ్డులోనున్న పొగాకు వేలం కేంద్రానికి కె.ఉప్పలపాడు గ్రామానికి చెందిన రైతులు 908 పొగాకు బేళ్లను సోమవారం అమ్మకానికి తెచ్చారు. అందులో 866 పొగాకు బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 42 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.200, అత్యల్ప ధర రూ.166, సరాసరి ధర 196.33 పైసలు పలికినట్లు ఎఎస్ శ్రీనివాసరావు తెలిపారు. **కొండపి :** కొండపి పొగాకు వేలం కేంద్రానికి మండల పరిధిలోనికామేపల్లి, పచ్చవ గ్రామాలకు చెందిన రైతులు 1,271 పొగాకు బేళ్లు అమ్మకానికి తెచ్చారు. అందులో 1,150 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 121 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.200, అత్యల్ప ధర రూ.150, సరాసరి ధర రూ.196.43 పైసలు పలికినట్లు వేలం నిర్వహణాదికారి ఎస్.రామారావు తెలిపారు. వేలం లో వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్థానికుల సహకారంతోనే గ్రామాభివృద్ధి : సర్పంచి

ప్రజాశక్తి-టంగుటూరు

స్థానికుల సహకారంతోనే గ్రామాభివద్ధి సాధ్యమవుతుందని టంగుటూరు సర్పంచి మద్దిరాల మమత అన్నారు. పంచాయతీ పరిధిలోని బుచ్చిరాజుపాలెం కాలనీలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి పాలకవర్గం నడుం బిగించింది. ఇటీవల కాలనీలో ఇదేం ఖర్మ- మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు పలు సమస్యలను నాయకుల దష్టికి తెచ్చారు. దీంతో సర్పంచి మద్దిరాల మమత, ఇఒ జగదీష్ బాబు, పాలక వర్గం స్పందించారు. వీధి దీపాలకు మరమ్మతులు, కొత్త కాలనీలో రోడ్డుపైకి వచ్చిన ముళ్ళ చెట్లు తొలగింపు, సైడ్ కాలువలకు మరమ్మతులు చేయించారు. మురుగు నీటి తొలగింపు చర్యలు చేపట్టారు. జెసిబి, పంచాయతీ సిబ్బంది సహకారంతో మురుగునీటి బయటకు పంపారు. వీధులను శుభ్రపరిచారు. సమస్యలపై స్పందించి పరిష్కరించిన సర్పంచి మద్దిరాల మమత, ఇఒ జగదీష్, ఉప సర్పంచి మక్కెన కోటేశ్వరరావు, వార్డు సభ్యులు కామని వెంకట్రావు, పంచాయతీ పాలకవర్గానికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.

సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-సిఎస్.పురం

సిఎస్‌పురం మండలం పెదరాజుపాలెం పంచాయతీకి చెంది దనేంకుల వెంకటస్వామి, దనేంకుల రవణయ్యకు మోకాళ్ళ శస్త్ర చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి నిధులు మంజూరయ్యాయి. అందులో భాగంగా దనేకుల వెంకటస్వామికి రూ.2లక్షలు, దనేంకుల రవణయ్యకు రూ.55వేల చెక్కును గ్రామ సర్పంచి పందిళ్ళ నాగమణి యల్లయ్య చేతుల మీదుగా సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్ దనేంకుల వెంకటరాజు, దనేంకుల నాగార్జున, మీసాల వెంకటస్వామి, ఉప్పుటూరి వెంకటేశ్వర్లు, దనేంకుల నాగరాజు, చింతనబోయిన కొండయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి-పొన్నలూరు

వినియోగదారులు విద్యుత్ విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కందుకూరు డివిజన్ విద్యుత్ శాఖ ఇఇ వీరయ్య తెలిపారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ సిబ్బంది సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఇ మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి విద్యుత్‌శాఖ నిర్వహించే ప్రత్యేక తనిఖీలలో భాగంగా గ్రామాలలో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. వినియోగదారులు విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకొని విద్యుత్ బిల్లులు, ఇతర బకాయిలు సకాలంలో చెల్లించి విద్యుత్‌శాఖకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఇఇలు రాఘవేంద్రరావు, యుగంధర్, విజయబాబు, డివిజన్ పరిధిలోని ఎఇలు ఇతర విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంకు చెందిన ఖాసింపీరా కుమార్తెకు వివాహం నిశ్చయమైంది. వివాహం జరిపించేందుకు ఖాసింపీరా ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన బంధువులు వివాహానికి అవసరమైన వస్తువులు సమ కూర్చారు. పెండ్లి చేసేందకు ఇతర ఖర్చులకు ఆర్థిక సాయం అవసరమైంది. ఈ విషయం గురించి తెలుసుకున్న చైతన్యజ్యోతి ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు తమ వంతుగా సాయంగా రూ.5 వేల నగదును ఖాసింపీరాకు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో చైతన్యజ్యోతి ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు కోటీశ్వర్లు, వీరాచారి, నాగయ్య, మల్లికార్జున, డమామ్ శ్రీను, బాబుల్ నాయక్, కొత్త పిచ్చయ్య, బాబులు నాయక్, గ్రంధిశిల కష్ణ, ఇమ్రాన్ ఖాన్, షేక్ మహబూబ్ బాషా, జ్యోతి ప్రసాదరావు, వంశీ, మలిపెద్ది రవీంద్రబాబు, పబ్బిశెట్టి రవి పాల్గొన్నారు.

రూ.25,116 విరాళం అందజేత

ప్రజాశక్తి-సిఎస్.పురం

మండల పరిధిలోని తలకొండపాడు గ్రామానికి చెందిన మాధవరావు నారాయణ, సుబ్బలక్ష్మమ్మల మట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో మహప్రాకార నిర్మాణాన్ని రూ.25,116 విరాళాన్ని సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ కొమ్మినేని చిన్నఆదినారాయణ, ఇఒ నర్రా నారాయణరెడ్డి, దాతలు ఆలయ సిబ్బంది, అర్చకుటు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

ప్రజాశక్తి-మర్రిపూడి

2023 ఖరీఫ్ సీజన్‌కు సబ్సిడీపై రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తున్నట్లు ఎఒ సిహెచ్ వెంకటేష్ తెలిపారు. 50 శాతం సబ్సిడీపై జనుము 10 కేజీల బ్యాగ్ రూ. 420, జీలుగలు 10 కేజీల బ్యాగ్ రూ. 395, పిల్లిపెసరలు 8 కేజీల బ్యాగ్ రూ. 388 అందేస్తున్నట్లు ఆయన తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధారుకార్డు, ఫోన్ నెంబరు ఒటిపి ద్వారా తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేయించు కోవాలన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తి అయిన వారం రోజుల తర్వాత విత్తనాలు పంపిణీ చేస్తారని తెలిపారు. మండల పరిధిలోని రైతులు ఈ అవకాశానిన సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మార్కాపురం



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చని ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి తెలిపారు. స్థానిక జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా క్రీడా సాధికార సంస్థ పర్యవేక్షణలో కోడి రామమూర్తి క్రీడా సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణా శిబిరాన్ని ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. క్రీడలతో చిన్నారులు మానసిక వికాసంతో పాటు శారీరక ధృడత్వాన్ని పొందుతారన్నారు. వేసవి శిక్షణా శిబిరం అధ్యక్షుడు పిన్నిక నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు ఈ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యక్షుడు గంగిశెట్టి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొనే విద్యార్థులకు అల్పాహారంతో పాటు తాగునీటి వసతి ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి ఫుట్‌బాల్, బాక్సింగ్ క్రీడల్లో పాల్గొని విద్యార్థుల్లో ఉత్తేజాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో ఫుట్‌బాల్ కోచ్, జిల్లా పోలీస్ టీం కెప్టెన్ ఉప్పు రామకృష్ణ, బాక్సింగ్ సీనియర్ క్రీడాకారుడు కె.వంశీకృష్ణ, వ్యక్తిత్వ వికాస నిపుణురాలు నారాయణం లావణ్య, సంస్థ కార్యదర్శి కాలంగి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి : చిర్లంచెర్ల

వేసవి సెలవుల్లో విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంచుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ కోరారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తి స్థాయిలో చదువుకున్న సమాజం తయారు కావడానికి గ్రంథాలయాల అవసరం ఎంతైనా ఉందన్నారు. గ్రంథాలయం అభివద్ధి కోసం తన తండ్రి స్వర్గీయ చెర్లంచర్ల చెంచయ్య జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులుగా ఉన్నప్పుడు మార్కాపురంలో శాశ్వత గ్రంథాలయ భవన నిర్మాణం కోసం కషి చేసినట్లు తెలిపారు. .ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉప సంచాలకులు డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి, శ్రీసాధన డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన శాస్త్రి, కొల్లి విజయలక్ష్మి, గ్రంథ పాలకులు జివి.శివారెడ్డి పాల్గొన్నారు. **సిఎస్.పురం :** స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో వీధులలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్ వెంకట్రామ్మయ్య. పిట్టా రంగస్వామి, ప్రమీల, గ్రంథపాలకుడు ఆళ్ల భాస్కరరావు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు. **కొమరోలు :** వేసవి శిక్షణా శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జడ్‌పిటిసి సారె వెంకటనాయుడు తెలిపాడు. స్థానిక శాఖా గ్రంథాల యంలో వేసవి శిక్షణా తరగతులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం అనేక పథకాలను ప్రవేశపె డుతుందన్నారు. నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకురాలు ప్రసన్నకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు. **అర్ధవీడు :** స్థానిక శాఖా గంథ్రాలయంలో వేసవిశిక్షణా తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, తెలుగు కథలు రాయడం చదవడం, గణితం, డ్రాయింగ్, క్రాఫ్ట్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. **జరుగుమల్లి :** వేసవి శిక్షణా శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక గ్రంథపాలకురాలు లక్ష్మీ నరసమ్మ తెలిపారు. గ్రంథాయలంలో వేసవి శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీ నరసమ్మ మాట్లాడుతూ వేసవి శిక్షణలో భాగంగా విద్యార్థులకు చిన్నారులకు కథలు వినిపించడం, పుస్తకాలు చదివించడం, పుస్తక సమీక్ష, చిత్రలేఖనం లాంటి సుజనాత్మక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఓ చిన్నారి పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచారు. **నాగులుప్పలపాడు :** మండల పరిధిలోని ఉప్పుగుండూరు గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరాన్ని గ్రామ సర్పంచి దేవరకొండ జయమ్మ, కార్యదర్శి శ్రీరామ్మూర్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకురాలు పి.నాగరజని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. **మద్దిపాడు :** స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకురాలు వసుంధరాదేవి మాట్లాడుతూ వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా విద్యార్థులకు చిత్ర లేఖనం, డ్రాయింగ్ పెయింటింగ్, కుట్లు అల్లికల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. **కొండపి :** గ్రంథాలయంలోని విలువైన విజ్ఞాన గ్రంథాలను పఠించి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తహశీల్దారు పి. సింగారావు విద్యార్థులకు సూచించారు. గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ వేసవి విజ్ఞాన కార్యక్రమాలు విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బ్రహ్మయ్య, గ్రంథపాలకుడు కోటేశ్వరరావు , విద్యార్థులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన

విద్యుత్ స్తంభాలు మార్చాలని నిరసన

ప్రజాశక్తి -గిద్దలూరు రూరల్



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

మండల పరిధిలోని కొంగల వీడు గ్రామంలో విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరి ప్రమాద భరితంగా మారాయి. ఈ విషయం గురించి సర్పంచి లక్ష్మి ప్రసన్న, గ్రామస్తులు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు స్పందిం చలేదు. దీంతో ఆగ్రహించిన సర్పంచి, గ్రామస్తులు రామాలయం గుడి వద్ద శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభం వద్ద సోమవారం నిరసన తెలిపారు. పంచాయతీ పరిధిలో మొత్తం 14 స్తంభాలు శిథిలావస్థకు చేరినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రమాదం జరగక ముందే విద్యుత్ అధికారులు స్పందించిన శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి- నాగులుప్పలపాడు



గ్రామోత్సవంలో వేణుగోపాలుడు

మండల పరిధిలోని ఉప్పుగుండూరు నిర్వహిస్తున్న శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా తెలగ సంఘం ఆధ్వర్యంలో వసంతసేవ, గ్రామోత్సవం వైభవంగా నిర్వహిం చారు. ఆలయ పూజరి దివి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఛైర్మన్ పెంట్యాల జ్యోతి శ్రీనివాసరావు, ఇఒ మీనిశెట్టి శ్రీనివాస రావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

వెలిగండ్ల : మండల పరిధిలోని ఇమ్మడిచెరువు గ్రామంలో మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి , ఆయన సతీమణి ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 11 వరకూ శ్రీషిరిడి సాయి మందిరం, నూతన శిఖర ప్రతిష్ట మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మూడు రోజులపాటు మందిరంలో వివిధ రకాల పూజలు, అన్నదాన కార్యక్రమం, సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆయా కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులకు అభినందనలు

.ప్రజాశక్తి -శింగరాయకొండ

పదో తరగతి పరీక్షల్లో శింగరాయకొండ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిం చారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థు లకు ప్రధానోపాధ్యా యురాలు దుంపా భారతి ఆధ్వర్యంలో సోమవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా 566 మార్కులు సాధించిన జె. శ్రీలేఖ, 500 మార్కులు పైగా సాధించిన మరో పదిమంది విద్యార్థి నులను సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానో పాధ్యాయురాలు దుంపా భారతి మాట్లాడుతూ గతేడాది తమ పాఠశాల విద్యార్థిని పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచినట్లు తెలిపారు. గత ఐదేళ్లుగా తమ పాఠశాలలో చదివిన విద్యార్థినులు మంచి మార్కులు సాధిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది 32 మంది ప్రథమ శ్రేణి, 17 మంది ద్వితీయ శ్రేణి, 6 తృతీయ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు మాధవి, రాధా, మాధవి, పద్మ, రోజా, పుష్పం, రమాదేవి, రాజ, సులోచన, కోటేశ్వరి, భారతి, గౌరీ, సుజాత, గోవిందమ్మ, బాలకోటయ్య, మాధవిలత, రాజ్యలక్ష్మి, కష్ణవేణి, లావణ్య, అనురాధ, రాజేంద్ర ప్రసాద్,సుబ్బారావు,రజిని తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పడిపోయిన ఉత్తీర్ణతా శాతం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఇటీవల విడుదల అయిన 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల్లో ఉత్తీర్ణతా శాతం గతంతో పోల్చిచూస్తే గణనీయంగా పడిపోయింది. జిల్లా మొత్తంగా చూస్తే ఉత్తీర్ణతా శాతం 75గా ఉన్నప్పటికీ జిల్లాలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలల ఉత్తీర్ణతా శాతం 30 శాతానికి పడిపోయింది. నాడు-నేడు పేరుతో కోట్ల రూపాయల మేర ప్రభుత్వం ఖర్చుపెడుతోంది. నిధులతో ప్రహరీ గోడలు, ముఖద్వారాలు, గ్రానైట్ రాళ్లతో పాఠశాలలను అందంగా తీర్చిదిద్దారు. ఉత్తమ బోధన కోసం అంటూ ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల మాధ్యమం తెచ్చారు. ట్యాబ్‌లు ఇచ్చారు కాని విద్యార్థుల అభ్యాసానికి కావలసిన మౌలిక వసతుల కల్పన లేకుండా పోయింది. ఇన్ని కోట్లు ఖర్చు పెట్టినా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగింది లేదు. ఉత్తీర్ణతా శాతం కూడా తగ్గిపోయింది. పదో తరగతి విద్యార్థులకు యూనిట్లు, అర్థ సంవత్సరం, త్రైమాసికం పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించడం, పరీక్షలలో వెనకబడిన విద్యార్థులను గమనించి ప్రత్యేక శ్రద్ధ పెట్టడం లాంటి చర్యలు సక్రమంగా తీసుకుంటే మంచి ఫలితాలు వచ్చేవని భావిస్తున్నారు. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల్లో అవసరాలకు తగినట్లుగా ఉపాధ్యాయ నియామకాలు జరగలేదు. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకాలు జరగలేదు. అన్నిటిని పర్యవేక్షించాల్సిన ప్రధానోపాధ్యాయులకు బోధనేతర పనులు ఎక్కువయ్యాయి. ఇలా పలు కారణాలతో ఉత్తీర్ణతా శాతం తగ్గిపోయింది.

జిల్లా లోని ఎయిడెడ్ స్కూల్స్‌లో 819 మంది పరీక్షలు రాస్తే 329 మంది పరీక్షల్లో తప్పారు. గవర్నమెంట్ స్కూల్స్‌లో 669 మంది పరీక్షలు రాస్తే 274 మంది పరీక్షల్లో తప్పారు. మున్సిపల్ స్కూల్స్‌లో 732 మంది పరీక్షలు రాస్తే 340 మంది పరీక్షల్లో తప్పారు. ఎపి సోషల్ వెల్ఫేర్ స్కూల్స్‌లో 542 మంది పరీక్షలు రాస్తే 11 మంది తప్పారు. జిల్లా పరిషత్ స్కూల్స్‌లో 7,558 మంది పరీక్షలు రాస్తే 2,545 మంది తప్పారు. మొత్తంగా చూస్తే జిల్లాలో 16,621 మంది పరీక్షలు రాస్తే ఇందులో 4,104 మంది తప్పారు. జిల్లాలో 10వ తరగతి పరీక్షా కేంద్రాల్లో కొన్ని చోట్ల ప్రయోగాత్మకంగా సిసి కెమెరాలు పెట్టారు. కారణాలు తెలియదు కాని ఆ కేంద్రాల్లో ఉత్తీర్ణతా శాతం తగ్గినట్లు చెబుతున్నారు. అలానే మూతపడిన ఎయిడెడ్ స్కూల్స్‌లోని విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకొచ్చారు. వారు చదువుల్లో వెనుకబాటులో ఉన్నందున ఆయా పాఠశాలల ఉత్తీర్ణతా శాతం తగ్గినట్లు తెలుస్తోంది.

స్కూల్ పేరు	పరీక్షకు హాజరు	పాస్	ఫెయిల్	ఉత్తీర్ణత శాతం
1 ఎయిడెడ్ స్కూల్స్	819	490	329	59
2 బిసి వెల్ఫేర్ స్కూల్స్	205	188	17	91
3 గవర్నమెంట్ స్కూల్స్	669	395	274	59
4 కస్తూరిభా విద్యాలయాలు	150	117	33	78
5 మున్సిపల్ స్కూల్స్	732	392	340	53
6 ఎపి మైనారిటీ స్కూల్స్	68	55	13	80
7 ప్రైవేట్ స్కూల్స్	5729	5327	402	92
8 ఎపి రెషిడెన్షియల్ స్కూల్స్	76	71	5	93
9 ఎపి సోషల్ వెల్ఫేర్ స్కూల్స్	542	427	115	78
10 ఎపి ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్స్	73	42	31	57
11 జిల్లా పరిషత్ స్కూల్స్	7558	5013	2545	66
మొత్తం	16621	12517	4104	75 శాతం

స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టరు రంజిత్ బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

స్పందనలో వచ్చిన అర్జీలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టరు పి రంజిత్ బాషా ఆదేశించారు. స్పందన కార్యక్రమం సోమవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో జరిగింది. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తమ సమస్యలను విన్నవించుకోవడానికి రాగా 102 అర్జీలు నమోదయ్యాయి. తన పరిధిలోని సమస్యలకు కలెక్టరు తక్షణమే పరిష్కారం చూపగా మిగిలిన వాటిని నిశితంగా పరిశీలించాలని, క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు. స్పందన అర్జీలపై అధికారులలో నిర్లిప్తత ఉండరాదని కలెక్టరు చెప్పారు. స్పందన కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికారులతోపాటు వీక్షణ సమావేశం ద్వారా మండల స్థాయి అధికారులతో కలెక్టరు మాట్లాడారు. రీసర్వే ప్రక్రియలో హద్దురాళ్ల ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ ప్రక్రియలో బాపట్ల జిల్లా పురోగతి తక్కువగా ఉండడంపై అధికారులను నిలదీశారు. తహశీల్దార్లు నిర్లిప్తంగా ఉండడం మంచిపద్ధతి కాదని అన్నారు. విధినిర్వహణలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టరు సిహెచ్ శ్రీధర్, డిఆర్‌ఓ కె లక్ష్మీ శివజ్యోతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


అధికారికి అర్జీ ఇస్తున్న దృశ్యం

అంగన్‌వాడీలపై అధికారుల ఒత్తిళ్లు ఆపాలి

ప్రజాశక్తి-రేపల్లె: రేపల్లె ప్రాజెక్ట్ పరిదిలో భట్టిపోలు మండలం అంగన్‌వాడీ హెల్పర్‌కు ఐసిడిఎస్ అధికారులు ఇచ్చిన మెమో ఉద్దేశపూర్వకంగా ఇచ్చినట్లు ఉందని, హెల్పర్‌పై ఒత్తిళ్లు ఆపాలని ఐసిడిఎస్ రేపల్లె ప్రాజెక్టు సిడిపిఓ ఎస్ మాణిక్యంకు ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ తరపున వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు బాపట్ల జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ చిన్న ఉద్యోగులుగా ఉన్న అంగన్‌వాడీ హెల్పర్‌పై అధికారులు ఉద్దేశపూర్వకంగా సంబంధంలేని అంశాలపై మెమో ఇచ్చి వివరణ అడగటం వల్ల తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఏ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పటికీ నిబంధనల ప్రకారం పనిచేస్తున్న వారిపై మెమోల పేరుతో వేధింపులు తగవని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ బాపట్ల జిల్లా అధ్యక్షులు కె ఝూన్సీ, సీఐటియూ భట్టిప్రోలు మండల కార్యదర్శి జీ సుధాకర్ పాల్గొన్నారు.

ప్రజల ప్రాణ రక్షణలో పోలీసులు ముందుంటారు: ఎస్పీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఆపదలో వున్న ప్రజల ప్రాణాలు రక్షించడంలో జిల్లా పోలీసులు ఎల్లప్పుడూ ముందుంటారని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. బాపట్ల జిల్లా సూర్యలంక, వాడరేవు సముద్ర తీర ప్రాంతాలలో సముద్రంలోకి కొట్టుకుపోతున్న యాత్రికుల ప్రాణాలు కాపాడిన సివిల్ మరియు మెరైన్ పోలీస్ సిబ్బందిని సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఆదివారం గుంటూరు జిల్లా క్రోసూరు మండలం నాగవరం గ్రామానికి చెందిన సుమారు 50 మంది యాత్రికులు వాడరేవు సముద్రతీరంలో విహారయాత్రకు వచ్చి సముద్రంలో మునుగుతుండగా వారిలోని 28 సంవత్సరాల వయస్సు గల సయ్యద్ రాజావలి ఒక్కసారిగా వచ్చిన అల తాకిడికి సముద్రంలోకి కొట్టుకుపోతుండగా అది గమనించిన కొత్తపట్నం మెరైన్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ ఏ నరేష్‌బాబు, హెూంగార్డు ఎస్ శ్రీనివాసరావులు వెంటనే స్పందించి ప్రాణాలకు తెగించి సముద్రంలోకి వెళ్లి అలల తాకిడికి కొట్టుకుపోతున్న సయ్యద్ రాజావలిని ఒడ్డుకు చేర్చి అతడి ప్రాణాలను కాపాడారు.


యాత్రికుల ప్రాణాలను కాపాడిన పోలీస్ సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేస్తున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

గత శుక్రవారం విహారానికి సూర్యలంక సముద్ర తీరానికి వచ్చి సముద్రంలో స్నానం చేస్తుండగా ఒక్కసారిగా పెద్ద అలలు రావటంతో నీటిలో మునిగి లోపలికి కొట్టుకుపోతున్న తాడేపల్లికి చెందిన యువకులు ఓ సాయికిరణ్, పి కిరణ్ లను సూర్యలంక మెరైన్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ జి గంగాధర్‌రావు, హెూంగార్డ్ ఎన్ శ్రీనివాసరావు, బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఎం పోతురాజు, కానిస్టేబుల్ పి వెంకటరావు, గజ ఈతగాడు సంగని సురేష్‌లు సముద్రంలోకి వెళ్లి నీటిలో మునిగి కొట్టుకుపోతున్న యువకులను కాపాడి ఒడ్డుకు చేర్చారు. ప్రాథమిక చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు. విధినిర్వహణలో సకాలంలో స్పందించి సముద్రంలో కొట్టుకుపోతున్న యాత్రికుల ప్రాణాలను కాపాడిన పోలీస్, మెరైన్ సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బాపట్ల జిల్లా సూర్యలంక, ఓడరేవు సముద్రతీరాలకు విచ్చేసే యాత్రికుల రక్షణ కోసం పటిష్ట భద్రత చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. తీరం వెంబడి గస్తీ పెంచామని, సముద్రంలో మునిగి కొట్టుకుపోతున్నవారిని రక్షించడానికి గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సముద్రతీరంలో అలల తాకిడికి కొట్టుకుపోతున్న 39 మంది యాత్రికుల ప్రాణాలను సివిల్, మెరైన్ పోలీస్, గజ ఈతగాళ్లు కాపాడారని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యలంక మెరైన్ సిఐ జి సుబ్బారావు, కొత్తపట్నం మెరైన్ ఇన్‌స్పెక్టర్ కె శ్రీనివాసరావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ఏ శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సేవలో రెడ్ క్రాస్

ప్రజాశక్తి-చీరాల

సామాజిక సేవా కార్యక్రమాల్లో రెడ్ క్రాస్ అన్నివేళలా ముందుంటుందని రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు అన్నారు. ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని చీరాల మండలంలోని ఈపురుపాలెం సిండికేట్ కాలనీలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రెడ్‌క్రాస్ చీరాల బ్రాంచ్ ఆధ్వర్యంలో జనరల్, డెంటల్, చర్మవ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. రెడ్‌క్రాస్ చైర్మన్ గుంటుపల్లి సుబ్బారావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా గొప్ప సేవా దృక్పథంతో ఉద్భవించిన సంస్థ రెడ్‌క్రాస్ అని గుర్తు చేశారు. 1948లో ప్రారంభమైన ఈ రెడ్ క్రాస్ సంస్థ ప్రపంచ దేశాలలో వివిధ రకాల సేవలను అందజేస్తూ ముందుకెళుతోందని అన్నారు. చీరాల బ్రాంచ్ తరపున ఇలా వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో చాలామంది ప్రజలు సద్వినియోగం చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీనివాసరెడ్డి ప్రసూన, సంస్థ ప్రతినిధులు బ్రహ్మారెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తారు రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి-పంగులూరు

పంగులూరు-రేణింగవరం గ్రామీణ లింక్ రోడ్డు నిర్మాణం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, వైసీపీ అద్దంకి నియోజకవర్గం ఇన్‌ఛార్జి శాప్ నెట్ చైర్మన్ బాచిన కృష్ణ చైతన్య అన్నారు. పంగులూరు, జనకవరం, కొండమూరు, రేణింగవరం, గ్రామాలను కలుపుతూ ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద, సుమారు రూ.7.2 కోట్లతో పది కిలోమీటర్ల పొడవు గల తారు రోడ్డు నిర్మాణాన్ని సోమవారం కృష్ణ చైతన్య ప్రారంభించారు. ఈ సందర్భంగా రేణింగవరంలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, పంగులూరు నుంచి అద్దంకి వెళ్లాలనుకునే ప్రయాణికులకు, ఈ రోడ్డు ఎంతో ఉపయోగంగా ఉంటుందని, సుమారు ఐదు కిలోమీటర్ల దూరం తగ్గే అవకాశం ఉందని అన్నారు. రైతులు పండించిన పంటలను పొలాల నుంచి ఇళ్ళకు తీసుకెళ్లేందుకు ఈ రోడ్డు ఉపయోగంగా ఉంటుందని చెప్పారు. మాజీ శాసనసభ్యులు వైసిపి నాయకులు బాచిన చెంచు గరటయ్య మాట్లాడుతూ, ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉండే ఈ రోడ్డు నిర్మాణాన్ని పటిష్టంగా నిర్మించారని, ప్రజలు దీనిని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తేళ్ల నాగమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్‌రెడ్డి, మండల అభివద్ధి కమిటీ అధ్యక్షుడు రాయిని వెంకట సుబ్బారావు, రేణింగవరం సర్పంచ్ హరి ప్రసాద్‌రెడ్డి, జనకవరం సర్పంచ్ తల్లపనేని వీరమ్మ, కొండమూరు సర్పంచ్ బండి శివకుమారి, పంగులూరు గ్రామ సర్పంచ్ గుడిపూడి నాగేంద్రమ్మ రామారావు, మండల కో ఆప్షన్ నెంబర్ ఖాసింఖాన్, ఎంపీటీసీ సింధూర అజిల్ తదితరులు పాల్గొన్నారు.

కత్తి సుబ్బయ్య మృతికి ఏలూరి సంతాపం

ప్రజాశక్తి-చిన్నగంజాం

పార్టీ అభివృద్ధికి కృషి చేసిన కత్తి సుబ్బయ్య(49) మతి చెందడం తెలుగుదేశం పార్టీకి తీరని లోటని పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు అన్నారు. మండలంలోని కడవకుదురు గ్రామానికి చెందిన సుబ్బయ్య సోమవారం ఉదయం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. టీడీపీ మండల ఎస్సి సెల్ ప్రధాన కార్యదర్శిగా పార్టీ కార్యక్రమాలలో చురుకుగా ఉండేవారని ఆ పార్టీ నాయకులు తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-బల్లికురవ రూరల్

మండల పరిధిలోని అంబడిపూడి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామ సర్పంచ్ మద్దుమాల కుసుమకుమారి రవిల ఆధ్వర్యంలో ఎల్‌వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. స్థానికులు ఈ కార్యక్రమంలో విరివిగా పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు 72 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

సమస్యలు పరిష్కరించాలని

మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్


కలెక్టర్‌కు అర్జీ ఇస్తున్న నాయకులు

ఒంగోలు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు, క్యాబ్ ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం ప్రకాశం భవనం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ నగరపాలక సంస్థలోని వివిధ విభాగాలలో సుమారు వెయ్యి మంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. దీర్ఘకాలికంగా వీరి సమస్యలు పరిష్కారానికి నోచుకోక ఇబ్బందిపడుతున్నారని చెప్పారు. కార్మికులకు సరైన పనిముట్లు ఇవ్వడం లేదని, సెఫ్టీ మెటీరియల్స్ ఇవ్వడం లేదని తెలిపారు. జీఓ నెంబర్.7 ప్రకారం ఔట్ సోర్సింగ్ కార్మికులందరికీ నెలకు రూ.15 వేల వేతనం ఇవ్వాల్సి ఉందన్నారు. అయితే ఒంగోలు నగరపాలక సంస్థలో కోవిడ్ కార్మికులకు గత మూడేళ్లుగా కేవలం నెలకు రూ.12 వేలే చెల్లిస్తున్నారని తెలిపారు. తక్షణమే జీవో నెంబర్.7 ప్రకారం కోవిడ్ కార్మికులకు నెలకు రూ.15 వేలు వేతనం ఇప్పించాలని, వారిని ఆప్కాస్‌లో చేర్చాలని కోరారు. వివిధ విభాగాలలో 12 మంది కార్మికులు చనిపోయి ఉన్నారని, వారి స్థానంలో వారి కుటుంబసభ్యులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్మికుల సమస్యల పట్ల కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. జీఓ నెంబర్ 7 ప్రకారం కోవిడ్ కార్మికులకు నెలకు రూ.15వేల వేతనం అందేలా చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో సిఐటియు నగర కార్య దర్శి టి మహేష్, యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు, నగర వర్కింగ్ సెక్రటరీ శ్రీరామశ్రీనివాసరావు, బాలయ్య పాల్గొన్నారు.

క్రీడాకారులను కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

తిరుపతిలో ఈనెల ఒకటో తేది నుంచి ఐదో తేది వరకు జరిగిన సిఎం కప్ 2023 చాంపియన్‌షిప్ క్రీడల్లో ప్రతిభ చూపిన జిల్లా క్రీడాకారులను జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ అభినందించారు. పురుషుల కబడ్డీ, మహిళల ఖో-ఖో, పురుషుల ఖో-ఖో, పురుషుల వాలీబాల్ విభాగాలలో జిల్లా క్రీడా బృందాలు విజేతలుగా నిలిచారు. పురుషుల అథ్లెటిక్స్ విభాగంలో మూడు బంగారు పతకాలు, మహిళల వెయిట్ లిఫ్టింగ్‌లో 3 రజత, 1 కాంస్య పతకం, పురుషుల బాక్సింగ్ విభాగంలో ఒక రజత, ఒక కాంస్య పతకం జిల్లాకు దక్కాయి. ఈ టోర్నమెంట్ ఓవరాల్ ప్రదర్శనలో ప్రకాశం జిల్లా మూడో స్థానంలో నిలిచింది. ఈ నేపథ్యంలో క్రీడాకారులు సోమవారం ప్రకాశం భవనంలో కలెక్టర్‌ను కలిసి వారు సాధించిన పతకాలను చూపించారు. విజేతలను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. మరిన్ని విభాగాలలోనూ పతకాలు సాధించి జిల్లాకు పేరు తెచ్చేలా సాధన చేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో స్టెప్ సిఈఓ బాబూరావు, జిల్లా ఛీఫ్ కోచ్ రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా

అధికారులు విధులు నిర్వహించాలి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

కలెక్టర్ దినేష్‌కుమార్


అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సమస్యలను పరిష్కరించడంలో అర్జీదారులు సంతృప్తి చెందేలా అధికారులు విధులు నిర్వహించాలని కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. సోమవారం స్థానిక కలక్టరేట్‌లోని స్పందన హాలులో 'డయల్ యువర్ కలెక్టర్' 'స్పందన' కార్యక్రమాలలో ప్రజల నుంచి ఆయన ఫిర్యాదులు, విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్పందనలో వచ్చిన అర్జీలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్జీలను నిర్దిష్ట గడువు లోపు సహేతుకంగా పరిష్కరించాలని సూచించారు. అర్జీలు రీఓపెన్ కాకుండా చూడాలన్నారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరించే విధంగా అధికారులు దృష్టి సారించాలని చెప్పారు. పరిష్కారం చూపలేని పక్షంలో అందుకు కారణాలను కూడా అర్జీదారులకు వివరించాలని కలెక్టర్ చెప్పారు. అర్జీలను కిందిస్థాయి అధికారులు పరిష్కరిస్తున్న తీరును ఆయా శాఖల ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు.

ముందుగా డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో ప్రజలు ఫోన్‌లో ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా, మండల స్థాయి అధికారులను ఆయన ఆదేశించారు. వీటిపై అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడారు.

కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె శ్రీనివాసులు, డిఆర్ఓ శ్రీలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎంవిఎస్ లోకేశ్వరరావు, చెన్నయ్య, సరళా వందనం, వరకుమార్, తదితర అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌పిని కలిసిన డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం


ఎస్‌పికి మొక్క అందజేస్తున్న ఒంగోలు డీఎస్పీ

సాధారణ బదిలీలో భాగంగా దర్శి సబ్ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న డీఎస్పీ వి. నారాయణస్వామిరెడ్డి ఒంగోలు డీఎస్పీగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఒంగోలు ఎస్‌డిపిఒ కార్యాలయంలో రిపోర్ట్ చేస్తుకున్న అనంతరం సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మలికగర్గ్‌ని మర్యాదపూర్వకంగా కలసి మొక్కను అందజేశారు.

దరిశి డీఎస్పీగా అశోక్‌వర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి-దరిశి


ఎస్‌పికి మొక్క అందజేస్తున్న దరిశి డీఎస్పీ

దరిశి డిఎస్‌పిగా అశోక్‌వర్ధన్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డిఎస్‌పి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం దరిశి సిఐ రామకోటయ్య, ఎస్ఐ రామక్రిష్ణతో పాటు సిఐలు, ఎస్ఐలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలిచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం అశోక్‌వర్ధన్‌రెడ్డి ఎస్‌పి మల్లికగర్గ్ ఒంగోలులో మర్యాదపూర్వకంగా కలిసి..మొక్క అందజేశారు.

కనిగిరి డీఎస్పీగా రత్నాకరం రామరాజు

ప్రజాశక్తి-కనిగిరి


ఎస్‌పికి మొక్క అందజేస్తున్న కనిగిరి డీఎస్పీ

కనిగిరి పట్టణంలోని గార్లపేట రోడ్డులోగల పోలీస్ క్వార్టర్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయంలో డీఎస్పీగా రత్నాకరం రామరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు జరిగిన తరువాత డిఎస్పీ కార్యాలయం సేవలు కనిగిరి నుంచి అందుబాటులోకి వచ్చాయి. డీఎస్పీని కనిగిరి సిఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్ఐ డి.ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి.. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. డీఎస్పీ రామరాజు ఒంగోలులో ఎస్‌పి మల్లికగర్గ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి..మొక్క అందజేశారు.

వ్యక్తిత్వ వికాసానికి

పుస్తక పఠనం దోహదం: కలెక్టర్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

వ్యక్తిత్వ వికాసానికి పుస్తక పఠనం ఎంతో దోహదం చేస్తుందని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ అన్నారు. రాష్ట్ర గ్రంథాల సంస్థ ఆదేశాలర మేరకు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేటి ప్రపంచంలో రాణించడానికి విషయ పరిజ్ఞానం పెంచుకోవడం, సృజనాత్మకంగా ఆలోచించడం ఎంతో కీలకమని చెప్పారు. ఆ దిశగా విద్యార్థులను తయారు చేసేలా ఆయా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. పుస్తక పఠనాన్ని ఒక అలవాటుగా మార్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. సమాజంలో ఉన్నత స్థానాలకు ఎదిగిన వారికి పుస్తక పఠనం ఎంతో ఉపయోగపడిందని అన్నారు. పిల్లలను ఆ దిశగా ప్రోత్సహిచాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాచగొర్ల వెంకట సుశీల, జిల్లా పంచాయతీ అధికారి జివి.నారాయణరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్, డిప్యూటి ఈఓ అనీతా రోజ్ రాణి, ఎంఈఓ ఓ కిషోర్‌బాబు, ఉప గ్రంథ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై అక్రమ కేసులు ఎత్తేయాలి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

కలెక్టర్‌కు ఉద్యోగ సంఘాల నేతల వినతి



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఉపాధ్యాయులపై అక్రమంగా నమోదు చేసిన కేసులు ఎత్తివేయాలని, కక్షసాధింపు ధోరణి మానుకోవాలని కోరుతూ ఎపి జెఎసి అమరావతి పక్షాన మూడో దశ ఉద్యమ కార్యచరణలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎపి జెఎసి అమరావతి జిల్లా చైర్మన్ ఆర్‌విఎస్ కృష్ణమోహన్, సెక్రటరీ వెంకటేశ్వరరెడ్డి, పిఆర్ ఇంజినీర్స్ సంఘం అధ్యక్షులు వేణుగోపాలరెడ్డి, ప్రభుత్వ డ్రైవర్ల సంఘం అధ్యక్షులు ప్రసన్న, విఆర్‌ఎల సంఘం నుంచి ఎలీషా, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, సెక్రటరి ఐ శిరీష్‌బాబు, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు బెజవాడ రవి, వేణు, కోమటిగుంట వెంకటేశ్వర్లు, డేనియల్ పాల్గొన్నారు.

సర్పంచ్ ధనలక్ష్మి మృతికి సంతాపం

ప్రజాశక్తి-దరిశి


ధనలక్ష్మి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వెంకాయమ్మ

మండలంలోని రామచంద్రపురం గ్రామ సర్పంచ్ బాదం ధనలక్ష్మి(45) ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. పోస్టుమార్టం అనంతరం ఆమె అంత్యక్రియలు సోమవారం నిర్వహించారు. ఎస్ఐ కేసు నమోదు చేశారు. ఆమె మృతదేహాన్ని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో వైస్ ఎంపిపి సోము దుర్గారెడ్డి, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీరామ్మూర్తి, ఉపాధ్యక్షులు మారం ఇంద్రసేనారెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షులు వీరభద్రాచారి, రాష్ట్ర కార్యదర్శి పూనూరి సుబ్బారావు, జిల్లా కార్యదర్శి బొమ్మల రామాంజనేయులు ఉన్నారు.


భోజనం వడ్డిస్తున్న ఉగ్ర నరసింహారెడ్డి

అన్నా క్యాంటీన్‌కు 100 రోజులు..

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి పట్టణంలోని అమరావతి గ్రౌండ్‌లో కనిగిరి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నా క్యాంటీన్ సోమవారంతో వంద రోజులు పూర్తిచేసు కుంది. అన్నా క్యాంటీన్ సేవలకు ఎటువంటి అంతరాయం రాకుండా కృషిచేసిన టిడిపి శ్రేణులకు డాక్టర్ ఉగ్ర కృతజ్ఞతలు తెలిపారు.


భూమి పూజ చేస్తున్న కమిషనర్

మురుగు కాల్వల నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

నగరంలోని 16వ డివిజన్ పోతురాజుపాలెం ప్రాంతంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించతలపెట్టిన మురుగు కాల్వలకు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆ డివిజన్‌లో పర్యటించి అక్కడ ఉన్న రోడ్లు, కాల్వల సమస్యలను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ వెంట స్థానిక కార్పొరేటర్ శ్రీరామ నాగభూషణం, కార్పొరేషన్ ఇంజినీర్ కె మాల్యాద్రి ఉన్నారు.